వైసీపీ నేతలు వేసిన అనధికారిక లేఅవుట్



నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్

పంచాయతీ, అహుడా అధికారుల నోటీసులు, ఫ్లెక్సీల తొలగింపు

కొనుగోలుదారులకు 18 ప్లాట్ల రిజిస్ట్రేషన్

మిన్నకుండిపోయిన అహుడా, పంచాయతీ అధికారులు

నోటీస్.. గీటీస్..
జాన్తా నై..!

వైసీపీ రియల్టర్ల బరితెగింపు..!

అనంతపురంరూరల్, జూలై 14: వైసీపీ రియల్టర్లు బరితెగించారు. నిబంధనలు తుంగలో తొక్కి లే అవుట్ వేశారు. పంచాయతీ అవసరాలకు స్థలం ఇవ్వాల్సి ఉండగా అది వదలేదు. మరో వైపు ల్యాండ్ కన్వర్షన్ జరగలేదు. అహుడా అనుమతులు తీసుకోలేదు. అయినా లేఅవుట్ వేయడంతో పాటు ప్లాట్లు వేసి దర్జాగా విక్రయించేశారు. ఇందుకు రిజిస్ట్రేషన్ అధికారులు యథాశక్తి సహకరించడంతో ఆ రియల్టర్ల పని మరింత సులువుగా జరిగి పోయింది. వాస్తవానికి ల్యాండ్ కన్వర్షన్ జరగకుండా లేఅవుట్ వేయకూడదు. అంతేకాకుండా పంచాయతీకి స్థలం ఇవ్వకుండా రిజిస్ట్రేషన్ చేయకూడదని నిబంధనలున్నాయి. దీనికితోడు అహుడా అనుమతులు కూడా ఉండాలి. ఇవేవీ లేకుండానే లేఅవుట్ వేసేశారు. ఈ నేపథ్యంలో పంచాయతీ అధికారులు అది అక్రమ లేఅవుట్ అంటూ కాంపౌండ్‌కు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అహుడా అధికారులు సైతం లేఅవుట్‌కు నోటీసులు అతికించారు. ఈక్రమంలోనే రిజిస్ట్రేషన్ అధికారులకు పంచాయతీ, అహుడా నుంచి సమాచారం కూడా వెళ్లినట్లు తెలుస్తోంది. అయినా రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు మాత్రం ఇవేవీ లెక్కలోకి తీసుకోకుండా వైసీపీ రియల్టర్లకు లబ్ధిచేకూర్చారు. తమ వద్దకు రిజిస్ట్రేషన్‌కు వస్తే చాలు..అన్నట్లుగా జెట్ స్పీడుతో ఆ అనధికార లేఅవుట్ లోని ప్లాట్లను రిజిస్టర్ చేసినట్లు తెలుస్తోంది. ఇది జిల్లా కేంద్రానికి సమీపంలోని అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి పంచాయతీలో జరిగింది.




ఫ్లెక్సీని తొలగించడంతో ఖాళీగా కనిపిస్తున్న ప్రహరీ

పంచాయతీ, అహుడా నిబంధనలు తుంగలోకి..

అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి కాలనీ పంచాయతీ కక్కలపల్లి గ్రామ సర్వే నెంబరు 14-2లో 6.8 ఎకరాల భూమి ఉంది. ఆ భూమిలో వైసీపీ రియల్టర్లు లేఅవుట్ వేశారు. సాధారణంగా అయితే అహుడా అనుమతులు ఉండాలి. అంతకంటే ముందు ల్యాండ్ కన్వర్షన్ చేయించాలి. పంచాయతీకి అవసరాలకు 60.8సెంట్లు స్థలం కేటాయించాలి. ఇవేవీ జరగకుండానే లేఅవుట్ వేశారు. విషయం అహుడా, పంచాయతీ అధికారుల దృష్టికి వెళ్లడంతో ఈనెల 9న అనధికార లేఅవుట్ అంటూ పంచాయతీ అధికారులు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అహుడా అధికారులు నోటీసులను లే అవుట్ కాంపౌండ్‌కు అతికించారు. వాటిని సదరు వైసీపీ రియల్టర్లు తొలగించేశారు. రిజిస్ట్రేషన్ అధికారులతో బేరం కుదుర్చుకుని రెండు రోజుల కిందట 18ప్లాట్లు కొనుగోలు దారులకు రిజిస్ట్రేషన్ చేయించినట్లు సమాచారం.

చోద్యం చూస్తున్న అహుడా, పంచాయతీ అధికారులు

వైసీపీ నాయకుల ముందు అహుడా, పంచాయితీ అధికారుల పాచికలు పారలేదని తెలుస్తోంది. ఆ అధికారులకు అనధికార లేఅవుట్ అంటూ ఫ్లెక్సీలు, నోటీసులు అతికించడానికే సరిపోయింది. ల్యాండ్ కన్వర్షన్ జరిగిందాలేదా చూడాల్సిన రెవెన్యూ అధికారులు ఆవైపు తొంగిచూడలేదు. దీనికి తోడు వైసీపీ రియల్టర్లకు రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు సహకరించడంతో ప్లాట్ల రిజిస్ట్రేషన్ చకచకా సాగిపోయింది. ఇందుకు సంబంధిత అధికారులకు పెద్ద మొత్తంలోనే ముట్టచెప్పారన్న వాదనలు ఆయా వర్గాల నుంచే వినిపిస్తున్నాయి.



సర్వే నంబరు 14-2లోని లేఅవుట్ ప్లాన్



పూజలందుకుంటున్న కుల్లాయిస్వామి

పోటెత్తిన భక్తజనం

కన్నుల పండువగా గూగూడు కుల్లాయిస్వామి చిన్నసరిగెత్తు

నార్పల, జూలై 14: ప్రసిద్ధిగాంచిన గూగూడు కుల్లాయిస్వామి చిన్నసరిగెత్తు కార్యక్రమం ఆదివారం కన్నుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో గూగూడు కిక్కిరిసి పోయింది. ఈ సందర్భంగా కుల్లాయి స్వామిని దర్శించుకుని చక్కెర చది వింపులు, ఫతేహాలు నిర్వహించారు. ఆంజనేయస్వామి ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్యూలైన్ ఎక్కువగా ఉండటంతో చాలా మంది భక్తులు ఆంజనేయస్వామి దర్శనం కాక వెనుదిరిగి వెళ్లిపోయారు. మంగళవారం పెద్ద సరిగెత్తు, బుధవారం జలధి కార్యక్రమం నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.



స్వామి దర్శనం కోసం తరలివచ్చిన భక్తులు

పలు ప్రాంతాల్లో చిరుజల్లులు

అనంతపురం అర్బన్ జూలై 14: జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం రాత్రి చిరుజల్లులు కురిశాయి. అనంతపురం, బెళుగుప్ప, గుత్తి, రాయదుర్గం, యాడికి, డీ.హీరేహాళ్, పుట్లూరు, గార్లదిన్నె శింగనమల తదితర మండలాల్లో చిరుజల్లులు కురిశాయి.

విత్తుకు సిద్ధం

సర్వం సిద్ధం చేసుకున్న అన్నదాతలు.. చినుకు కోసం ఎదురుచూపులు

గార్లదిన్నె, జూలై 14: ప్రకృతి సహకరిస్తున్న గ్యారెంటీ లేదు. పంట పండుతుందో? లేక ఎండుతుందో తెలియదు. ధర ఉంటుందో పంట చేతికి రాగానే పడిపోతుందో అంచనా లేదు. కానీ అతను రైతు కదా..! మొండి ధైర్యం ఆయన సొంతం. అందుకే ఖరీఫ్‌లో ఓ మోస్తరుగా వర్షాలు కురిసినా వందల ఎకరాల్లో పంటలు సాగు చేశాడు. మరి కొందరు మళ్లీ వర్షం కురిస్తే సాగు చేయడానికి పొలాలు సిద్ధం చేసుకున్నారు. మండలంలో రెండు, మూడు సార్లు ఓ మోస్తరు వర్షాలు కురవడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. ఇంతకాలం బీళ్లుగా వదిలేసిన భూములను దుక్కిచేసి, విత్తనం వేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. వరుస పంట నష్టాలతో అప్పుల్లో కూరుకుపోయిన అన్నదాతలకు ఈ ఏడాది పంట సాగుకు రైతిలో చేతిలో చిల్లిగవ్వ లేకుండా పోయింది. ఇన్‌పుట్‌సబ్సిడీ అంతంత మాత్రమే అందింది. ఇలాంటి తరుణంలో అప్పులు చేసి పంటలు సాగు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు 600 ఎకరాలు వేరుశనగ, 700 ఎకరాలు కంది, 1500 ఎకరాలు ఆముదం పంటలు సాగుచేశారు. వర్షం కురిస్తే సుమారు 4800 ఎకరాల్లో వేరుశనగ, దాదాపు 1800 ఎకరాల్లో కంది సాగు చేసేందుకు అవసరమైన విత్తనాలు, మందులు రైతులు సిద్ధంగా ఉంచుకున్నారు.

వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతు



పెరిగిన ఖర్చులు....

గతంలో పోలిస్తే ఈ సారి పంట సాగు ఖర్చులు తడిసిమోపెడవుతున్నాయి. ఎకరా పొలం దుక్కి చేసేందుకు, విత్తనాలు కొనుగోలు చేసి విత్తు వేసే ఎరువులు, పురుగు మందులతో పాటు పంట నూర్పిడి చేసే వరకు ఎకరాకు సుమారు రూ. 30వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తుందని రైతులు చెబుతున్నారు. ఇప్పటికే పురుగు మందులు ధరలు భారీగా పెరిగాయి. మంచి దిగుబడులు సాధించాలంటే ఎరువుల వినియోగం తప్పనిసరి అయింది. విత్తనాలు, ఎరువులతో పాటు క్రిమిసంహారక మందులకు వేలాది రూపాయలు వెచ్చించాలంటే అన్నదాతలు బెంబేలెత్తిపోతున్నారు.





కోటంకలో వేరుశనగ విత్తనాలు సిద్ధంచేస్తున్న మహిళలు

వర్షం వస్తే విత్తనం వేస్తాం



నాకు ఎనిమిదెకరాల పొలం ఉంది. ఇటీవల కురిసిన అరకొర వర్షానికి కొంత పొలంలో కంది పంట సాగు చేశా. వర్షం కురిస్తే వేరుశనగ విత్తనం సాగు చేసేందుకు విత్తనాలు, ఎరువులు, మందులు సిద్ధం చేసుకున్నాం.

-పెద్దతాతయ్య, మర్తాడు

విత్తేందుకు సిద్ధంగా ఉన్నాం



నాకున్న నాలుగెకరాల పొలంలో ప్రతి ఏటా వేరుశనగ సాగుచేస్తాం. ఇప్పటికే గ్రామంలో కొంతమంది రైతులు ఆరకొర పదునుకే విత్తు విత్తారు. ప్రతి ఏడాది దిగుబడులు అంతంత మాత్రమే వస్తున్నాయి. ఈ ఏడాది దిగుబడులు బాగా వస్తాయని ఆశిస్తున్నాం. వర్షం కురిస్తే వేరుశనగ సాగు చేసేందుకు సిద్ధంగా ఉన్నా.

-రామసుబ్బారెడ్డి, కోటంక

వర్షం వచ్చేదే ఆలస్యం



నాకున్న నాలుగెకరాలలో ప్రతి ఏడాది వేరుశనగ పంట సాగుచేస్తున్నాం. సాగుచేసిన ప్రతి సారీ నష్టాలే చవిచూస్తున్నాం. ఈ ఏడాది వేరుశనగ సాగుచేసేందుకు అవసరమైన విత్తనాలు సిద్ధం చేసుకున్నాం. అదేవిధంగా ఎరువులు, మందులు కొనుగోలు చేసుకున్నాం. వర్షం వస్తే వేరుశనగ సాగుచేస్తాం.

- బోయ సుబ్బులు, కోటంక

నెలాఖరు వరకు వేరుశనగ సాగు చేయవచ్చు

ఖరీఫ్ సాగుకు అవసరమైన వేరుశనగ విత్తనాలను రైతులకు సబ్సిడీ ద్వారా సరఫరా చేశాం. మండలంలో కోటంక, మర్తాడు, సిరివరం, కనుంపల్లి తదితర గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు కొంతమంది రైతులు వేరుశనగ చేశారు. కనుంపల్లిలో అధికంగా ఆముదం పంట సాగు చేశారు. మండల వ్యాప్తంగా 5200 ఎకరాలలో వేరుశనగ సాగుచేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 600 ఎకరాలలో వేరుశనగ సాగుశారు. అదేవిధంగా 2300 ఎకరాలలో కంది సాగుచేయాల్సి ఉండగా ఇప్పటికే 700 ఎకరాలు సాగు చేశారు. 1100 ఎకరాలలో ఆముదం సాగుచేయాల్సి ఉండగా 1500 ఎకరాలలో సాగుచేశారు. జూలై ఆఖరి వరకు వేరుశనగ పంట సాగుచేసుకోవచ్చు.

- సోమశేఖర్, వ్యవసాయ అధికారి





ఏం ప్రయోజనం!

ఆరు పీహెచ్‌సీలకు అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రాలు

అక్కడ గైనకాలజిస్టులు, రేడియాలజీ టెక్నీషియన్లు లేరు

కేటాయింపునకు సతమతమవుతున్న వైద్యాధికారులు



అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరీక్షలు చేస్తున్న వైద్యులు (ఫైల్)

అనంతపురం టౌన్, జూలై 14: జిల్లాలో ఆరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రాలు వచ్చాయి. జిల్లాలోని తరిమెల, కంబదూరు, బెళుగుప్ప, పెద్దవడుగూరు, ఎద్దులపల్లి, వజ్రకరూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలకు ఈ యంత్రాలను కేటాయించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ పీహెచ్‌సీలకు అధునాతన యంత్రాలు రావడంతో మహిళలు, గర్భిణులు, ఇతర ప్రజలు స్కానింగ్ చేయించుకోవడానికి వేరే ఆస్పత్రులకు వెళ్లాల్సిన అవస్థ తప్పింది. ఒక్కో యంత్రానికి దాదాపు రూ.10లక్షలు వెచ్చించి ఈ ఆస్పత్రులకు పంపినట్లు అధికారులు తెలిపారు. అయితే ఈ ఆసుపత్రుల లో గైనకాలజిస్టులు లేరు. దీంతో అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రాలు ఎలా వాడుకోవాలోననే సందిగ్ధంలో వైద్యశాఖ అధికారులు పడ్డారు. దీంతో తమకు మెరుగైన వైద్య సేవలు అందుతాయో లేదోననే ఆందోళన గ్రామీణ ప్రజల్లో వ్యక్తం అవుతోంది.

సీహెచ్‌సీల నుంచి పంపాలని వినతి

వైద్యవిధాన పరిషత్ పరిధిలో నడుస్తున్న సీహెచ్‌సీల నుంచి గైనకాలజిస్టలను ఈ పీహెచ్‌సీలకు పంపాలని సంబంధిత డీసీహెచ్‌ఎస్‌కు జిల్లా వైద్యాధికారి విన్నవించారు. ఈమేరకు నెల రోజులు కిందటే విజ్ఞప్తి చేసినా అక్కడి నుంచి ఇప్పటికీ సమాధానం రాలేదు. సీహెచ్‌సీలకు రోగులు, గర్భిణులు అత్యధికంగా నే వస్తుంటారు. దీంతో ఇక్కడే పని ఎక్కువగా ఉంటుంది. అలాంటి పరిస్థితుల్లో అక్కడకు ఎలా వెళ్లేదని సీహెచ్‌సీలలో పనిచేస్తున్న గైనకాలజిస్టలు ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. వ్యవహారం ఇలా ఉండటంతో స్కానింగ్ యంత్రాలు వచ్చినా ప్రజలకు ఉపయోగం లేకుండా పోతుందనే వాదన వినిపిస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపాల్సిన అవసరం ఉంది.

డాక్టర్లను పంపాలని డీఎంహెచ్‌ఓ అడిగారు



అల్ట్రాసౌండ్‌స్కానింగ్ యంత్రాలు వచ్చిన పీహెచ్‌సీలకు గైనకాలజిస్టలను పంపించాలని డీఎంహెచ్‌ఓ అడిగారు. ఈవిషయంపై మా సీహెచ్‌సీ డాక్టర్లలో మాట్లాడుతున్నాం. ఇక్కడే పని ఒత్తిడి ఎక్కువగా ఉంది. ఈక్రమంలో అక్కడికి ఎలా వెళ్లేదని వారు ప్రశ్నిస్తున్నారు. చివరకు వారానికి ఓ రోజైన ఆ పీహెచ్‌సీలకు వెళ్లమని చెబుతున్నా, త్వరలో ఈసమస్య పరిష్కారం అవుతుంది.

- డాక్టర్ రవికుమార్ (డీసీహెచ్ఎస్)

వారానికి ఓరోజు అల్ట్రాసౌండ్ సేవలందిస్తాం



ఆరు పీహెచ్‌సీలకు అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రాలు వచ్చిన విషయం వాస్తవమే. అయితే ఆ యంత్రాలు నిర్వహించాలంటే రేడియాలజీ టెక్నీషియన్లు, గైనకాలజిస్టలు ఉండాలి. ప్రస్తుతం ఆ పీహెచ్‌సీలలో అలాంటి సిబ్బంది ఎవరూ లేరు. అందుకే ప్రస్తుతం రేడియాలజీ టెక్నీషియన్లను సర్దుబాటు చేస్తున్నాం. సీహెచ్‌సీలలో ఉన్న గైనకాలజిస్టలను ఇక్కడకు పంపమని డీసీహెచ్‌ఎస్‌ను కోరాం. వారానికి ఓరోజు పంపిస్తామంటున్నారు. ఆప్రకారం వారంలో ఒకరోజు స్కానింగ్ అవసరమైన వారిని రమ్మని సేవలు అందేలా చూస్తాం.

- డాక్టర్ ఈబీ దేవి, డీఎంహెచ్ఓ

మట్టి మిద్దె కూలి దంపతుల దుర్మరణం



కూలిన మట్టి మిద్దె

ఘోరం

రోదిస్తున్న మృతుల బంధువులు...



విడపనకల్లు, జూలై 14: మండలంలోని హావళిగి గ్రామంలో పాత మట్టి మిద్దె కూలి ఆదివారం తెల్లవారుజామున దంపతులు మృతి చెందారు. గ్రామానికి చెందిన కోనప్ప గారి మారెప్ప(48), అతడి భార్య లక్ష్మీదేవి(44) కొత్తగా నిర్మించుకుంటున్న ఇంటి పైకప్పునకు శనివారం రాత్రి 8 గంటల వరకూ ఆర్‌సీసీ వేశారు. వారి ఆచారం ప్రకారం ఆర్‌సీసీ వేసిన కొత్త ఇంటిలో నిద్రించకూడదని, ఆదివారం ఉదయం కొత్త ఇంటిలో చేరుదామని, పక్కనే ఉన్న తమ పాత ఇంటిలో నిద్రించారు. మారెప్ప, అతడి భార్య లక్ష్మీదేవి ఇంటికి మధ్యలో నిద్రించారు. మృతురాలి తమ్ముడు రాము, కూతురు మానస కొంచెం ముందు భాగంలో నిద్రించారు. ఇద్దరు కొడుకులు అంజి, హనుమంతు ఇంటి ఎదుట వరండాలో నిద్రించారు. అయితే శనివారం సాయంత్రం గాలితో కూడిన చిన్నపాటి వర్షం కురిసిన నేపథ్యంలో అర్ధరాత్రి దాటిన తర్వాత 2గంటల సమయంలో మట్టిమిద్దె పైకప్పు కూలింది. దీంతో ఇంటికి మధ్యలో నిద్రిస్తున్న మారెప్ప, లక్ష్మీదేవి మట్టిలో కూరుకుపోయి ఊపిరి ఆడక అక్కడికక్కడే మృతి చెందారు. చివరలో ఇరుక్కున్న మృతురాలి కూతురు మానస, మృతురాలి తమ్ముడు రాములను గ్రామస్థులు కాపాడి 108 వాహనంలో ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మండల రెవెన్యూ అధికారులు ఆర్ఐ వన్నప్ప, వీఆర్వో రవికుమార్, పాల్తూరు ఇన్‌చార్జి ఎస్ఐ ఖాసీం సాబ్, సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఉరవకొండలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు. పాల్తూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కలిసే కాటికి పోతున్నారా!

దంపతులు మారెప్ప, లక్ష్మీదేవి ఇద్దరు ఒకేసారి మృతి చెందడంతో బంధువుల రోదనలు మిన్నంటాయి. ఇన్నాళ్లు కలిసి బతికిన మీరు కలిసే కాటికి పోతున్నారా అంటూ రోదించారు. దంపతులిద్దరూ మట్టిలో కూరుకుపోయి మృతి చెందటంతో వీరిని చూడటానికి గ్రామంలోని ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు.

అనాథలుగా మారిన ముగ్గురు పిల్లలు

మృతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె మానస (దివ్యాంగురాలు) ఉన్నారు. కొడుకులు ఏదోలా బతకగలరు. కానీ కూతురు పరిస్థితి ఏమిటని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పుట్టుకతోనే మాటలు రాని మానస ఆలనా పాలన ఎవరు చూసుకుంటారు అంటూ కన్నీరు పెట్టుకున్నారు. మృతురాలికి తల్లీదండ్రి కూడా లేరని ఉన్న ఒక సోదరుడు కూడా ఇదే ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడని, వీరికి దిక్కెవరు అంటూ అక్కడికి వచ్చిన వారు కంట తడి పెట్టుకున్నారు.

అప్పులు చేసి కొత్త ఇంటి నిర్మాణం

కోనప్ప గారి మారెప్ప వైసీపీ కార్యకర్త అయినా వైసీపీ పాలనలో ఇల్లు మంజూరు కాలేదు. రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వంలో ఇతడి పేరున ఇంటి బిల్లును అప్పటి కాంగ్రెస్ నాయకులు కాజేయడమే కారణం. దీంతో తమకు ప్రభుత్వం నుంచి ఇల్లు రాదని భావించిన కూలిపనులు చేసుకునే ఆ దంపతులు అప్పులు చేసి కొత్త ఇంటి నిర్మాణం చేపట్టారు. శనివారం సాయంత్రం తమ కొత్త ఇంటికి పైకప్పు వేశారు. ఆదివారం ఉదయం కొత్త ఇంటిలోకి చేరాలని, పక్కనే ఉన్న తమ పాత మిద్దెలో నిద్రించి ప్రాణాలు పోగొట్టుకున్నారు. తెల్లారి ఉంటే కొత్త ఇంటిలోకి చేరేవారని దేవుడు ఎంత పని చేశాడని గ్రామస్థులు ఆవేదన చెందారు.

మంత్రి కేశవ్ దిగ్భ్రాంతి

హావళిగి గ్రామానికి చెందిన మారెప్ప, లక్ష్మీదేవి మిద్దె కూలి మృతి చెందిన విషయం తెలుసుకున్న రాష్ట్ర మంత్రి పయ్యావుల కేశవ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జరిగిన ఘటనపై జిల్లా కలెక్టర్‌తో ఫోన్ ద్వారా చర్చించారు. మృతుల కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ప్రమాదంపై జిల్లా అధికారులకు సమగ్ర నివేదిక ఇవ్వాలని విడపనకల్లు తహసీల్దార్‌ను ఆదేశించారు.



ప్రమాదంలో గాయపడిన మానస

జాతీయ క్రీడాపోటీలకు జిల్లావాసుల ఎంపిక



ఎంపికైన పారా క్రీడాకారులతో అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 14: జాతీయ పారా క్రీడపోటీలకు జిల్లావాసులు ఎంపికయ్యారు. ఈనెల 16వ తేదీ నుంచి బెంగళూరులోని కన్నడ కంఠీరవ స్టేడియంలో నిర్వహించనున్న జాతీయస్థాయి 13వ జూనియర్, సబ్ జూనియర్ పారా అథ్లెటిక్ చాంపియన్‌షిప్-2024కు ఎంపికైన వారిని ఆదివారం స్థానిక అశోక్‌నగర్ ఇండోర్ స్టేడియంలో అధికారులు అభినందించారు. రాధిక, వెంకటేష్, ప్రతాప్‌కుమార్ రెడ్డి, నాగేంద్ర, వినయ్‌దత్, తిలక్, సుదర్శన్, భార్గవ్‌కుమార్, నరేష్, తరుణ్ ఉన్నారు. కార్యక్రమంలో జిల్లా విభిన్నప్రతిభావంతుల సంక్షేమశాఖ ఏడీ అబ్దుల్‌రసూల్, కోచ్‌లు షఫీ, మంజుల, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

టీబీ డ్యాంలో 31 టీఎంసీల నీరు



బొమ్మనహాళ్, జూలై 14: తుంగభద్ర జలాశయానికి 31.709 టీఎంసీలు చేరాయి. ఇన్‌ఫ్లో ఆదివారానికి 14,560 క్యూసెక్కులకు తగ్గింది. వారంరోజులుగా ఇన్‌ఫ్లో హెచ్చుతగ్గుదల మధ్య కొనసాగుతోంది. ప్రస్తుతం జలాశయంలో 105.788 టీఎంసీలకు గాను 31.709 టీఎంసీల వరకు నీరు నిల్వ అయ్యాయి. అవుట్ ఫ్లో 203 కూసెక్కులుండగా 1633 అడుగుల డ్యాం ఎత్తుకు గాను 1606.81 అడుగుల వరకు నీరు చేరాయి. జలాశయం పరివాహక ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టింది. దీంతో తుంగభద్రకు చేరాల్సిన వరదనీరు ఆశించిన స్థాయిలో రావడం లేదు. గత వారం వచ్చిన వరదనీరు ప్రస్తుతం తగ్గడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది.

జిల్లాకు చేరిన ఐసీఏఐ బస్సుయాత్ర

● పరిశ్రమల స్థాపనపై విద్యార్థులకు అవగాహన



ఐసీఏఐ జిల్లా కార్యాలయం వద్ద బస్సు యాత్ర బృందం సభ్యులు

అనంతపురం అర్బన్, జూలై 14: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్ర ఆదివారం జిల్లాకు చేరుకుంది. చిన్న, మధ్యతరహా, భారీ పరిశ్రమలు అండ్ స్టార్టప్‌లపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జూన్ 29వ తేదీన బెంగళూరు నుంచి ప్రారంభమైన బస్సు యాత్ర తమిళనాడు, కేరళ, తిరుపతి, కడప మీదుగా అనంతకు చేరుకుంది. ముందుగా రాప్తాడు సమీపంలోని ఇండస్ట్రియల్ పార్క్‌లో జడ్పీ సీఈఓ నిదియాదేవి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సువన సోనీ, రాప్తాడు ఎంఎస్ఎం ఈ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రాఘవేంద్ర తదితరులు మొక్కలు నాటారు. అనంతరం స్థానిక జేఎన్‌టీయూ సమీపంలోని ఐసీఏఐ జిల్లా శాఖ కార్యాలయంలో పారిశ్రామిక ఔత్సాహికులు, విద్యార్థులకు పరిశ్రమల స్థాపనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ నాగరాజారావు, అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ మేనేజర్ చంద్రమౌళి, రూడ్‌సెట్ డైరెక్టర్ విజయలక్ష్మి, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ అధికారి రుద్రయ్య, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు శేషాంజనేయులు, ఐసీఏఐ జిల్లా చైర్మన్ ప్రదీప్‌కుమార్, వైస్ చైర్మన్ మహ్మద్ అబ్దుల్ రాఖీబ్, కార్యదర్శి ఫణికుమార్, కోశాధికారి అరవింద్‌రామ, చార్టెడ్ అకౌంటెంట్ వెంకటేష్, ఎంఎస్ఎం సభ్యుడు రవిశంకర్ పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేయాలి

● డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య



శిక్షణకు హాజరైన డ్వాక్రా సభ్యులతో డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 14: రైతు ఉత్పత్తిదారుల, డ్వాక్రా సంఘాలను సంస్థాగతంగా బలోపేతం చేయాలని డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య అన్నారు. స్థానిక ప్రశాంతి జిల్లా సమాఖ్య కార్యాలయంలో ఆదివారం డ్వాక్రా సంఘాల కృషి సఖిలకు ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ.. జిల్లాలో రైతులు పండించే పంటలపై అవగాహన కల్పించడం, పంటలకు మార్కెటింగ్ చేయడం, రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే రైతు ఉత్పత్తిదారుల సంఘాల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. జిల్లాలో సారవంతమైన నేలల్లో సేంద్రియ వ్యవసాయం పట్ల రైతులను ప్రోత్సాహించాలన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, మందులు అందించడంలో ముందుండాలన్నారు. డ్వాక్రా సంఘాలను సంస్థాగతంగా బలోపేతం చేస్తూ, ఇతర జిల్లాలకు అన్ని విభాగాల్లో నంబర్‌వన్‌గా నిలిచి మోడల్‌గా నిలపాలని సూచించారు. ఆధునికీకరణ పద్ధతులను అనుసరిస్తూ బీజామృతం, ఘన జీవామృతం, ద్రవజీవామృతం, సీమాస్త్రం, విత్తనశుద్ధి, ఏటీఎం మోడల్, ఏ గ్రేడ్ మోడల్ అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఆసక్తి ఉన్న రైతులను ఎంపిక చేసి కృషిసఖి ద్వారా ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించేలా చైతన్యం చేయాలని సూచించారు. అనంతరం రైతుసాధికార సంస్థ శిక్షకులు భానుమతి, భూపాల్‌రెడ్డి కృషిసఖిపై అవగాహన కల్పించారు. ఏపీఎంలు మరి, రియాజ్‌బేగ్, చిన్న వెంకటప్ప, భాస్కర్‌నాయుడు, సీసీ నారాయణస్వామి, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ వైద్యం వికటించి మహిళ మృతి



ఉత్తమ్మ మృతదేహం

తనకల్లు, జూలై 14: మండలంలోని కొక్కంటి గ్రామ దళితవాడకు చెందిన ఉత్తమ్మ (50) ఆదివారం ఆర్ఎంపీ ఇచ్చిన సూదిమందు వికటించి మృతిచెందింది. ఆమె బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొక్కంటి దళితవాడలో ఉత్తమ్మ, బావన్న దంపతులు నివాసం ఉంటున్నారు. ఉత్తమ్మ నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతుండేది. కొక్కంటి క్రాస్‌లో ఉన్న ఎంఆర్ క్లినిక్‌కు వెళ్లింది. క్లినిక్ నిర్వహిస్తున్న ఆర్ఎంపీ అబ్దుల్లా సూది మందు ఇచ్చాడు. అది వికటించడంతో ఆర్ఎంపీ.. ఆమెను ఆటోలో తనకల్లు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. మార్గమధ్యలో ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఆస్పత్రిలో పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న బంధువులు ఆస్పత్రికి చేరుకున్నారు. వారు రాగానే ఆర్ఎంపీ అక్కడి నుంచి జారుకున్నాడు. ఉత్తమ్మ మృతిపై ఫిర్యాదు అందలేదని తనకల్లు ఎస్ఐ ధరణీబాబు తెలిపారు. ఆదివారం రాత్రి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నాగేంద్ర నాయక్.. ఎంఆర్ క్లినిక్‌ను తనిఖీ చేశారు. సీజ్ చేశారు. కొక్కంటి క్రాస్‌లో అర్హతలేని వారు క్లినిక్‌లు నిర్వహిస్తున్నారనీ, వెంటనే చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓను టీడీపీ నాయకులు కోరారు.

వేగంగా విస్తరిస్తున్న ఇసుక మేటలు

నివారణ చర్యలు శూన్యం

కణేకల్లు, జూలై 14: వేదావతి హగరి పరివాహక ప్రాంతంలో దాదాపు 200 ఏళ్ల క్రితం ఏర్పడిన ఇసుకమేటలు రోజురోజుకు విస్తరిస్తూ ప్రజలకు ఇబ్బందికరంగా మారుతున్నాయి. రాయదుర్గం నియోజకవర్గంలోని కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లో దాదాపు 30 నుంచి 50 అడుగుల మేర ఎత్తులో ఇసుకదిబ్బలు ఏర్పడి ప్రజల జీవన విధానానికి ఆటంకంగా మారాయి. గతంలో ఇసుకమేటల నివారణకు ప్రభుత్వం అనేకచర్యలు తీసుకున్నప్పటికీ అవి అంతంత మాత్రంగానే ఉండడంతో అవి రోజురోజుకు వేగంగా వ్యాప్తి చెందుతున్నాయి. ఏడేళ్ల క్రితం టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎడారిలో ఇసుకను తరలించేందుకు కొన్ని ప్రయత్నాలు చేసి దాదాపు 53 మంది రైతుల పొలాల్లో ఇసుకను కూడా తరలించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం దీని ఏమాత్రం పట్టించుకోలేదు. తిరిగి టీడీపీ ప్రభుత్వం రావడంతో ఇసుకమేటలు నివారణకు చర్యలు తీసుకుంటారన్న ఆశ ఈ ప్రాంత ప్రజల్లో నెలకొంది.



బిదురకుంతం వద్ద విస్తరించిన ఇసుకమేటలు

ఐదువేల ఎకరాల్లో విస్తరణ

కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లో విస్తరించిన ఇసుకమేటలు దాదాపు ఐదువేల ఎకరాల్లో వ్యాప్తి చెంది ఉన్నాయి. 200 ఏళ్ల క్రితం వేదావతి హగరికి పెద్ద ఎత్తున నీటి ఉధృతి రావడంతో ఇసుక అంతా ఈ ప్రాంతంలో ఉండిపోయింది. దాదాపు 12 గ్రామాల పరిధిలో ఇసుకమేటలు పెద్ద ఎత్తున విస్తరించి ఉన్నాయి.

జూలై, ఆగస్టు మాసాల్లో తీవ్ర ఇబ్బందులు

ప్రతి యేడాది జూలై, ఆగస్టు మాసాలలో వీచే బలమైన ఈదురుగాలులకు ఈ ప్రాంతంలో నివసించే ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. కణేకల్లు మండలంలోని కళేకుర్తి, మాల్యం, నాగేపల్లి, తుంబిగనూరు, గరుడచేడు, మీండ్లపల్లి, బిదురకుంతంతోపాటు బొమ్మనహాళ్ మండలంలోని దర్గాహోన్నూరు, కల్లదేవనహళ్లి, గోవిందవాడ తదితర ప్రాంతాల్లో ఇసుకమేటలకు దిగువవైపున ఉండడంతో ఈదురుగాలుల వల్ల ఇసుకరేణువులు గ్రామాల్లోకి వస్తున్నాయి. మీండ్లపల్లి గ్రామంలోనైతే ఈ రెండు మాసాలలో తినే వస్తువులపై కూడా ఇసుకరేణువులు పడడంతో ప్రజలు తీవ్ర అగచాట్లు పడుతున్నారు.

పంటల రక్షణ సమస్యే..

ప్రాంతంలో వేదవతి హగరి ఉండడంతో రైతులు దాదాపు 50 అడుగుల్లోపే బోర్లు వేసుకుని పంటలు సాగుచేసుకుంటుంటారు. అందులో ప్రధానంగా వేరుశనగ, మొక్కజొన్న, సన్‌ఫ్లవర్ వంటి పంటలు అధికంగా పండిస్తుంటారు. అయితే పంటసాగు చేసే సమయంతోపాటు అవి మొలకెత్తేదశలో ఇసుకవ్యాప్తితో పంటలు మొలకెత్తేందుకు ఇబ్బంది తలెత్తుతున్నాయి. మొలకెత్తిన పంటలపై కూడా ఇసుక కప్పుతుండడంతో రైతులు చాలా జాగ్రత్తతో పంటలు పండించాల్సి వస్తోంది. ఇందుకోసం చాలా మంది రైతులు పొలాల్లో అక్కడక్కడ పరదాలు కట్టి ఇసుక వ్యాప్తి చెందకుండా పరిరక్షించుకుంటున్నారు.

సినిమా షూటింగ్‌లకు నిలయం

పెద్ద ఎత్తున ఇసుకతెన్నెలు ఉండడంతోపాటు కిలోమీటర్ల మేర ఇసుక వ్యాప్తి ఉండడంతో సినిమా నిర్మించే వారి కన్ను ఈ ప్రాంతంపై పడింది. ఈనేపథ్యంలోనే కొన్నేళ్ల కిందట ప్రముఖ నటుడు విక్టరీ వెంకటేష్ కథానాయకుడిగా నటించిన జయం మనదేరా సినిమా షూటింగ్ జరిగింది. అప్పటి నుంచి చిన్న చిన్న సినిమాలకు సంబంధించి షూటింగ్‌లు జరుగుతూ వస్తున్నాయి.



ఇసుక మేట వేయకుండా పొలాల్లో అడ్డంగా కట్టిన తెరలు

పంటసాగుకు తీవ్ర ఇబ్బందులు



మా గ్రామం చుట్టూ ఇసుక తప్ప మరేమీ లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఆ భూములనే చదును చేసుకొని పంటలు సాగు చేస్తుంటాం. అయితే పంటలు ఒక స్థితికి వచ్చేంత వరకు ఇసుక వ్యాప్తితో ఇబ్బంది పడే పరిస్థితి ఉంది. గాలుల వచ్చే ఇసుక తాము సాగుచేసిన పంటలపై పడి పంట ఎదుగుదలకు తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్నాయి.

- ప్రకాష్, రైతు, నాగేపల్లి

చిన్నప్పటి నుంచి చూస్తున్నా..



చిన్నప్పటి నుంచి ఇసుకమేటలను చూస్తున్నాను. ఇప్పుడు నాకు 55 ఏళ్లు . ఇసుకమేటలు రోజు రోజుకు వ్యాప్తి చెందుతున్నాయి. దీంతో మా జీవనానికి అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

- నాగరాజు, గరుడచేడు

తరలిస్తే బాగుంటుంది..



ఇసుకను తరలిస్తే వ్యవసాయం చేసుకుని రైతులు జీవించేందుకు ఆస్కారం ఉంటుంది. ప్రభుత్వం చర్యలు తీసుకుని ఇసుకను తరలిస్తే బాగుంటుంది.

- ఎర్రిస్వామి, రైతు, మీండ్లపల్లి

ఆషాఢమాసంలో తీవ్ర ఇబ్బందులు



ఆషాఢమాసంలో వీచే బలమైన గాలుల వల్ల, గ్రామం పక్కనే ఉన్న ఇసుక అంతా ఒక్కసారిగా ఊరిలోకి వచ్చి పడుతుంది. దీంతో తినే అన్నంలోకి, ఇతర తినుబండారాల్లోకి ఇసుకరేణువులు పడుతునే ఉంటాయి. తద్వారా తమ జీవన విధానానికి కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

- చాముండి, గృహిణి, మీండ్లపల్లి

ప్రభుత్వంతో కలిసి పనిచేస్తాం

ఉపాధి కల్పన, స్కిల్ డెవలప్‌మెంట్‌కు ఉమ్మడి ప్రణాళిక

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి

ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచోఫెర్రర్.. నారా లోకేశ్‌తో భేటీ

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 14: ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలకు తమ వంతు పూర్తి సహకారం అందిస్తూ కలిసి పనిచేస్తామని ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచోఫెర్రర్ అన్నారు. ఆదివారం అమరావతి రాజధాని ఉండవల్లిలోని విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళగిరి చేనేత శాలువాతో ఫెర్రర్‌ను మంత్రి సత్కరించగా, పుష్పగుచ్ఛం అందజేసిన ఫెర్రర్ లోకేశ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. 1969లో విన్సెంట్‌ఫెర్రర్ ఆర్డీటీని స్థాపించి ఉమ్మడి ఏపీ రాష్ట్రంలో 3వేల గ్రామాల్లో ప్రభుత్వానికి సమాంతరంగా నిస్వార్థంగా సేవలందించడం స్ఫూర్తిదాయకమని లోకేశ్ కొనియాడారు. యువగళం పాదయాత్రలో ఆర్డీటీ కార్యాలయాన్ని సందర్శించిన లోకేశ్ టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే ఆర్డీటీ సేవలు మరింత విస్తరింపచేసే విధంగా కలిసి పనిచేద్దామని ప్రతిపాదించినట్లు గుర్తుచేశారు. ఎన్నేళ్లుగా జిల్లాను పట్టిపీడిస్తున్న నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పన, స్వయం ఉపాధి, మహిళా సాధికారత, యువతకు స్కిల్ డెవలప్‌మెంట్, ఫారిన్ లాంగ్వేజెస్ శిక్షణ ఇతర దేశాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పనకు ఆర్డీటీతో కలిసి పనిచేయాలని భావించినట్లు మంత్రి తెలిపారు. మంత్రి ప్రతిపాదనకు సానుకూలంగా స్పందించిన మాంచోఫెర్రర్ ప్రభుత్వంతో కలిసి ఉమ్మడి ప్రణాళికతో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి, సేవా, మౌలిక సదుపాయాల కోసం పనిచేస్తామన్నారు.



మాంచోఫెర్రర్‌ను సన్మానిస్తున్న నారా లోకేశ్

సీపీఎస్‌పై గత ప్రభుత్వ మోసాలు దారుణం

నిరసనలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు

అనంతపురం విద్య, జూలై 14: సీపీఎస్‌ను వారంలో రద్దు చేస్తామని చెప్పి.... జీపీఎస్‌ను తీసుకొచ్చిన గత వైసీపీ ప్రభుత్వం మోసాలు దారుణం అంటూ పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. యూటీఎఫ్ నేతలు క్లాక్‌టవర్ వద్ద జీపీఎస్ గెజిట్‌ను దహనం చేశారు. ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప మాట్లాడుతూ గత ప్రభుత్వం సీపీఎస్ స్థానంలో జీపీఎస్ తీసుకొచ్చిందన్నారు. జీవో 54ను తీసుకురావడం దారుణమన్నారు. ఇది అమలు కాకుండా అనేక పోరాటాలు చేశారన్నారు. దానికి కొనసాగింపుగా ప్రస్తుత ప్రభుత్వం గెజిట్‌ను విడుదల చేసిందన్నారు. ఈ గెజిట్‌ను రద్దు చేయాలని కోరారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గోవిందరాజులు, గౌరవాధ్యక్షుడు రమణయ్య, సీఐటీయూ నేతలు నాగేంద్ర, లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం గెజిట్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. అదేవిధంగా 117 జీవోనూ రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నేతలు సంజీవ్‌కుమార్, నాగేంద్ర, చిత్తప్ప, గంగాధర్, వెంకట్ నాయుడు, రాజ కుళ్లాయప్ప, సీతారాంరెడ్డి, రాజేంద్ర, హెన్రీ మార్క్, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు

ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి: ఏపీసీపీఎస్‌ఈఏ నేతలు

వారంలో సీపీఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చిన గత ప్రభుత్వం జీపీఎస్‌ను తీసుకొచ్చిందని ఏపీసీపీఎస్‌ఈఏ జిల్లా ప్రధానకార్యదర్శి రామన్న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జీపీఎస్ గెజిట్‌కు తాము వ్యతిరేకమన్నారు. గత ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దు చేసినట్టుగానే ఈ జీపీఎస్ గెజిట్‌ను రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు మేలు చేయాలని డిమాండ్ చేశారు.






శ్రీసత్యసాయి యూనిటీ కప్ బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ట్రస్టు సభ్యులు, క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మురళీకార్తీక్

సత్యసాయి క్రికెట్ టోర్నీ విజేత భారత్‌లెవన్

పుట్టపర్తి, జూలై 14: శ్రీసత్యసాయి యూనిటీ కప్ క్రికెట్ టోర్నమెంటులో విజేతగా భారత్‌లెవన్ నిలిచింది. ఆదివారం స్థానిక శ్రీసత్యసాయి హిల్‌వ్యూ స్టేడియంలో టోర్నీని నిర్వహించారు. శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, యూనివర్సిటీ చాన్సిలర్ చక్రవర్తి, మాజీ క్రికెటర్ మురళీకార్తీక్ టోర్నీని ప్రారంభించారు. మొదటిరోజు భారత్‌లెవన్, గ్లోబల్ లెవన్ మధ్య పోటీ జరిగింది. మొదటి బ్యాటింగ్ చేసిన గ్లోబల్ లెవన్ 97 పరుగులకు ఆలౌట్ కాగా ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన భారత్‌లెవన్ ఒక వికెట్ కోల్పోయి 99 పరుగులు చేసి విజయం సాధించింది. అనంతరం ఆర్‌జే రత్నాకర్ మాట్లాడుతూ సంవత్సరంపాటు అన్ని రాష్ట్రాల్లోని జిల్లాలు, అంతర జిల్లాలు, రాష్ట్ర, జోనల్‌స్థాయి క్రికెట్ పోటీలను నిర్వహిస్తామన్నారు. వచ్చే ఏడాది జూలై 14న ప్రశాంతి నిలయంలో ఫైనల్ మ్యాచ్ ఉంటుందన్నారు. సత్యసాయి సేవాసంస్థల్లోని సభ్యులు మాత్రమే ఈ టోర్నమెంటులో పాల్గొనడానికి అర్హులన్నారు. అనంతరం సాయికుల్వంత్ సభామండపంలో సత్యసాయి గ్లోబల్ యంగ్ అడాల్ట్ ముగింపు సదస్సును నిర్వహించారు. సత్యసాయి సేవాసంస్థల జాతీయ అధ్యక్షుడు నిమీష్ పాండే భవిష్యత్ కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. క్రికెటర్ మురళీకార్తీక్ మాట్లాడుతూ ప్రశాంతి నిలయం వేదికగా క్రికెట్ టోర్నమెంటు నిర్వహించడం శుభపరిణామమన్నారు. తాను 1997లో సత్యసాయి బాబా దర్శనం చేసుకున్నానని, ఆ తర్వాత ఇండియా టీంలో అవకాశం లభించడం సత్యసాయి మహత్యమేనని అన్నారు. యువత సత్యసాయి ప్రేమతత్వంపై సంగీత గానాన్ని నిర్వహించారు. భక్తులు మహామంగళహారతి అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



వైసీపీ నాయకుడిపై కేసు

కదిరి, జూలై 14: కదిరి మున్సిపాలిటీ ఆవరణలో ఉన్న తుక్కును తరలించిన వైసీపీ నాయకుడు పరికి సాదిక్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. ఫిబ్రవరిలో మున్సిపాలిటీలో ఉన్న తుక్కును అనుమతిలేకుండా బయటకు తరలించిన వైసీపీ నాయకుడు పరికి సాదిక్, మహబూబ్‌బాషాపై శనివారం కేసు నమోదు చేశారు. సుమారు 500 టన్నుల ఇనుప తుక్కును తరలించారు. దీని విలువ సుమారు రూ.15 వేలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

టమోటా కిలో రూ.50

అనంతపురంరూరల్, జూలై 14: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.50తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. ఆదివారం 60 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.40, కనిష్ఠ ధర రూ.32 పలికినట్లు ఆయన తెలిపారు.

రైతు సేవాకేంద్రాల్లో పశుగ్రాస జొన్న విత్తనాలు పంపిణీ

అనంతపురం అర్బన్, జూలై 14: జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో సబ్సిడీతో పశుగ్రాస జొన్న విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు పశుసంవర్థక శాఖ జేడీ సుబ్రహ్మణ్యం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 8వతేదీ నుంచి ఆదివారం దాకా రైతు సేవా కేంద్రాలు, పశువైద్యశాలల్లో పశుగ్రాస వారోత్సాలను నిర్వహించామన్నారు. పశుపోషణకు ఉపయోగపడే విధంగా 55 మెట్రిక్ టన్నుల పశుగ్రాస విత్తనాలు అందుబాటులో ఉంచామన్నారు. 75 శాతం సబ్సిడీతో పశుగ్రాస జొన్న విత్తనాలు పంపిణీ చే స్తామన్నారు. కేజీ పశుగ్రాసం విత్తనం పూర్తి ధర రూ.92లు, ఇందులో సబ్సిడీ రూ.69పోను రైతు వాటా కింద రూ.23లు చెల్లించాలన్నారు. 5 కేజీల విత్తనాల కిట్ రైతు సేవా కేంద్రంలో ఉంచామన్నారు. పాడి రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్సీ వెల్ఫేర్ జేడీ మధుసూదన్‌రావు రిలీవ్

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూలై 14: సాంఘిక సంక్షేమశాఖ జేడీ మధుసూదన్ రావు రిలీవ్ అయ్యారు. ఈ నెల 2వ తేదీన రాష్ట్రశాఖ అధికారులు బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే జిల్లా కలెక్టర్ నుంచి రిలీవ్ ఆర్డర్ అందాల్సి ఉండగా ఆదివారం అందాయి. దీంతో ఆయన మంగళవారం రాష్ట్రశాఖకు జాయినింగ్ రిపోర్ట్ అందజేయనున్నారు. ఆయన స్థానంలో బీసీ సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారీకి ఎస్సీ సంక్షేమశాఖ డీడీ ఇన్‌చార్జ్ బాధ్యతలు జిల్లా కలెక్టర్ అప్పగించారు.

డీఆర్‌డీఏ-వెలుగు పీడీగా ఓబుళమ్మ

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 14: డీఆర్‌డీఏ-వెలుగు అనంతపురం పీడీగా ఓబుళమ్మ నియమితులయ్యారు. డీఎల్‌డీఓ ఓబుళమ్మను డీఆర్‌డీఏ-వెలుగు ఎఫ్ఏసీ పీడీగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం ఓబుళమ్మ డీఆర్‌డీఏ-వెలుగు పీడీగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇదివరకు పీడీగా ఉన్న నరసింహారెడ్డి దీర్ఘకాలిక సెలవులో ఉన్నారు. దీంతో ఏపీడీగా ఉన్న ఈశ్వరయ్య ఇప్పటి వరకు ఎఫ్ఏసీ పీడీగా కొనసాగారు.

బీబీ ఫాతిమా బ్రహ్మోత్సవాలను
జయప్రదం చేయండి


బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దర్గా కార్యవర్గం

అనంతపురం కల్చరల్, జూలై 14: నగరంలోని ఐదో రోడ్డులో వెలసిన బీబీ ఫాతిమా దర్గా వద్ద 22నుంచి 30వతేదీ వరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున పిలుపునిచ్చారు. ఆదివారం దర్గాలో బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. మల్లికార్జున మాట్లాడుతూ... ఉత్సవాల్లో భాగంగా 22న పెట్టె మెరవణ, 23, 24, 26వ తేదీల్లో నిత్యపూజలు, 25న చిన్న సరిగెత్తు, 27న పెద్ద సరిగెత్తు, పానకాలు, 28న అగ్నిగుండ ప్రవేశం, జలధి కార్యక్రమాలు ఉంటాయన్నారు. 30వ తేదీన ఉదయం 9 గంటలకు అమ్మవారి చివరి దర్శనం, అదేరోజు సాయంత్రం 6.30 గంటలకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు విరివిగా పాల్గొని ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. దర్గా కమిటీ సభ్యులు నరసింహులు, కేఎస్ మురళి, కిశోర్, మహేష్, చంద్రశేఖర్, అజ్జి, తిమ్మప్ప పాల్గొన్నారు.

నేటి నుంచి మహిళల క్రికెట్ పోటీలు
● సౌత్‌జోన్‌కు ముగ్గురి ఎంపిక


పిచ్‌పై కొలతలు వేస్తున్న అంపైర్లు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 14: జోనల్‌స్థాయి మహిళల క్రికెట్ పోటీలు సోమవారం నుంచి అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో ప్రారంభించనున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి తెలిపారు. సౌత్‌జోన్ జట్టుకు జిల్లా నుంచి మనీషా, పల్లవి, బిందుమాధవి ఎంపికయ్యారు. చిత్తూరు, సౌత్‌జోన్, విశాఖపట్నం, నార్త్ జోన్, కృష్ణా, సెంట్రల్‌జోన్ ఆరు జట్లు పోటీలకు ప్రాతినిథ్యం వహించనున్నాయి. ఇప్పటికే ఆయా జట్ల క్రీడాకారులు స్టేడియానికి చేరుకుని సాధన చేస్తున్నారు. సౌత్‌జోన్‌కు ఎంపికైన క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.


మనీషా


పల్లవి


బిందుమాధవి

బ్యాడ్మింటన్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక


శ్రీనివాసులు


సుబ్బారావు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 14: ఇండోర్‌స్టేడియం బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్‌ఏ ఇండోర్‌స్టేడియంలో అసోసియేషన్ కార్యవర్గసమావే శం నిర్వహించారు. అధ్యక్షులుగా నెహ్రూ యువ కేంద్రం జిల్లా ప్రోగ్రాం ఇన్‌చార్జి శ్రీనివాసులు, కార్యదర్శిగా పీవీకేకే ప్రిన్సిపాల్ సుబ్బారావు, ఉపాధ్యక్షులుగా రాజేంద్రప్రసాద్, రామకృష్ణారెడ్డి, మారుతిప్రసాద్, సహాయ కార్యదర్శులుగా శ్రీనివాసులుబాబు, కేఎస్ బాబు, లక్ష్మీనరసప్ప, కార్యవర్గసభ్యులుగా దాసరి శ్రీనివాసులు, ధనుంజయనాయుడులను ఎన్నుకున్నారు. ఇండోర్‌స్టేడియంతోపాటు జిల్లా వ్యాప్తంగా బ్యాడ్మింటన్ క్రీడాభివృద్ధికి, క్రీడాకారులకు ప్రోత్సహిస్తామని నూతన కార్యవర్గం తీర్మానించింది.

ఉచిత వైద్య పరీక్షలు



రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

అనంతపురం టౌన్, జూలై 14: ప్రజా రోగ్య వేదిక ఆధ్వర్యంలో కేర్ అండ్ క్యూర్ ఆస్పత్రి యాజమాన్యం సహకారంతో రెండురోజులు ఉచిత గుండె పరీక్షలు శిబిరం నిర్వహించారు. డాక్టర్ అభిషేక్ నేతృత్వంలో వచ్చిన వారికి 2డీ ఎకో పరీక్షలు నిర్వహించారు. ఆదివారం ఉచిత శిబిరం ముగిసింది. ప్రజా రోగ్య వేదిక రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒత్తిడితో కూడుకున్న జీవనం వల్ల ప్రస్తుత సమాజంలో చాలామంది గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారని అన్నారు. అలాంటి వారికి గుండె పరీక్షలు నిర్వహించి, అవగాహన కల్పించి, ఆరోగ్యంగా ఉంచేందుకే ఇలాంటి సేవాకార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఇందుకు సహకరిస్తున్న ఆస్పత్రులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర నాయకులు రాజామోహన్, మనోహర్, నాగరంగయ్య, బాలకృష్ణ, ఆర్‌వీ నాయుడు, రామక్రిష్ణ పాల్గొన్నారు.

పశువుల సంత ఆదాయం రూ.3.49 లక్షలు

అనంతపురంరూరల్, జూలై 14: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన పశువులసంతతో మార్కెట్‌కు రూ.3,49,470 ఆదాయం వచ్చినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి జయలక్ష్మి ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా మార్కెట్‌కు రూ.2,16,770, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1,32,700 వచ్చిందని తెలిపారు.

ఘనంగా చిన్నసరిగెత్తు

శింగనమల జూలై 14: మండల కేంద్రంలో మొహరం సందర్భంగా చిన్నసరిగెత్తును ఘనంగా నిర్వహించారు. ఆదివారం మకానంలో పీర్లను గ్రామంలో ఊరేగించారు. భక్తులు తరలివచ్చి పీర్ల స్వాములకు మొక్కుబడులు చెల్లించుకున్నారు.

మత్స్యకారులకు శాపంగా మారిన ఆర్థిక విధానాలు

శింగనమల జూలై 14: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన ఆర్థిక విధానాలు శాపంగా మారాయని ఆ సంఘం కార్యదర్శి నాగాంజనేయులు, కార్యవర్గ సభ్యుడు లింగమయ్య అన్నారు. ఆదివారం శింగమనల, బుక్కరాయసముద్రం మత్స్యకారులతో స్థానిక దుర్గాంజనేయస్వామి ఆలయం వద్ద సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మత్స్యకారులు వేట సమయంలో మృతిచెందితే రూ.20 లక్షలు బీమా చెల్లించాలని, రాయితీతో వలలు, బోట్లు ఇవ్వాలని, బీసీ కార్పొరేషన్ ద్వారా సొసైటీకి నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వెంకటనారాయణ, నగేష్ పాపారాయుడు, బాలరాజు, అక్బర్, పక్కీరప్ప, హరికృష్ణ, నాగన్న, వీరాంజి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాగాంజనేయులు

కమిషనర్ నగరపాలికకా..?
కలెక్టరేట్‌కా..?

- ఆసుపత్రుల నుంచి ఆలయాల పరిశీలన వరకు..
- అన్నింటికీ వాడేసుకుంటున్న వైనం
- అనంత నగరం అధ్వానం
- పాలకవర్గం అలా.. అధికారులు ఇలా..
- ఆక్రమణలు, నిర్మాణాలు ఇష్టారాజ్యం
- ఆర్ఐ పోస్టులకు పైరవీలు



అనంతపురం క్రైం, జూలై 14: చిరుద్యోగైనా.. ఉన్నతాధికారైనా ఎవరు చేయాల్సిన వారు చేస్తేనే బాగుంటుంది. చేసేపని చేయకుండా మరో పనిమీద దృష్టి పెడితే ఇక్కడ చేయాల్సిన పని బాధ్యతా రహితంగా ఉంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఉమ్మడి జిల్లాల పరిధిలో ఏకైక కార్పొరేషన్ అనంతపురం నగరపాలిక. అప్పట్లో టీడీపీ ప్రభుత్వ హయాంలో కార్పొరేషన్‌లకు ఐఏఎస్‌లను నియమిస్తేనే అభివృద్ధి దిశగా సాగుతాయని భావించి వారినే నియమిస్తూ వచ్చారు. కానీ కొన్నిసార్లు అది గతి తప్పినా... మరోసారి ఐఏఎస్‌నే నియమించారు. అయితే ఆ అధికారి నగరపాలిక సమస్యలపై దృష్టి సారించేలా ఉండనివ్వడం లేదు. జిల్లా అధికార యంత్రాంగం తమ పనులకు ఆయనను ఉపయోగించుకుంటోందనే విమర్శలున్నాయి. ఇతర శాఖల సమస్యలపై నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌లకు, సమీక్షలకు నగర కమిషనర్ మేఘస్వరూప్ వెళ్తుంటారు. కలెక్టరేట్ అధికారులు నగర కమిషనర్‌ను ఎక్కడ ఉపయోగించుకోవాలంటే ఆయనను అక్కడకు పంపుతున్నారు. పించన్ పంపిణీలోనూ పక్క ఊళ్లకు పంపుతున్నారు. ఎన్నికల సమయంలో తాడిపత్రి ఇన్‌చార్జిగా నియమించారు. కార్పొరేషన్‌లో ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌లో కమిషనర్ కూర్చోరు... కానీ కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో కమిషనర్ ప్రత్యక్షమౌతారు. కమిషనర్ అలా వెళ్తుంటే నగరంలో అనేక సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పారిశుధ్యం నుంచి అక్రమ కట్టడాల వరకు అన్నీ అక్రమాలే సాగుతున్నాయి. వైసీపీ నాయకులు చేసిన ఆక్రమణలు సైతం ఛేదించలేకపోయారు. తాజాగా సవేరా ఆసుపత్రి కాలువ నిర్మిస్తుంటే అడ్డుకోలేకపోయారు. ఇలా అన్నింటా అభివృద్ధి విషయంలో నగరపాలిక వెనుకబడుతూనే ఉందనే ఆరోపణలున్నాయి.

మున్సిపాలిటీగానే భావిస్తున్నారా?

అదేదో అనంతపురం నగరాన్ని చిన్న మున్సిపాలిటీగా భావిస్తున్నట్లున్నారు. నగర కమిషనర్లను తెగ వాడేస్తుంటారు. గతంలో కమిషనర్‌గా ఉన్న ఐఏఎస్ అధికారి ప్రశాంతిని అప్పటి కలెక్టర్ ప్రభుత్వాసుపత్రి పర్యవేక్షించే పనిని అప్పగించారు. విమర్శలు రావడంతో పనులు అప్పగించలేదు. ఇక ప్రస్తుతం మున్సిపల్ ఆర్డీగా ఉన్న పీవీవీఎస్ మూర్తిని ఎంతలా వాడుకున్నారంటే... ఉద్యోగంపై విరక్తి చెంది దీర్ఘకాలిక సెలవులోకి వెళ్తారనే పరిస్థితి కల్పించారు. ఇదివరకు కమిషనర్‌గా ఉన్న భాగ్యలక్ష్మితో ఏకంగా కొన్ని నిధులు వెచ్చించి కలెక్టరేట్‌కు సంబంధించిన పనులు చేయించారనే ఆరోపణలున్నాయి. అప్పటి కలెక్టర్ గంధం చంద్రుడు ఓ సమయంలో రామ్‌నగర్ ఫ్లైఓవర్ బ్రిడ్జికి పెద్ద మొత్తంలో కార్పొరేషన్ నిధులు వెచ్చించాలని చూస్తే కుదర్లేదు. ఇలా నగర కమిషనర్ మేఘస్వరూప్‌పైనా అదే స్థాయిలో ఒత్తిళ్లు తీసుకొస్తున్నట్లు సమాచారం. చివరకు గ్రూప్స్ పరీక్షలను పర్యవేక్షించడానికి, తాజాగా ఓ ప్రముఖ ఆలయంలో పరిస్థితులను పర్యవేక్షించడానికి, ప్రభుత్వాసుపత్రిలో అలసత్వంపైనా ఆయనే పర్యవేక్షించాల్సి వస్తోంది. నగరంలో తాగునీటి పైపుల లీకేజీలు, పారిశుధ్యం, గుంతల రోడ్లు, దోమల బెడద, ముందుకు సాగని పనులు, ఆక్రమణలు, అక్రమ కట్టడాలు ఇలా అన్నీ సమస్యలే. కొన్ని ఫైల్స్ పెండింగ్‌లో ఉండటం, కమిషనర్ ఫ్రీగా ఉన్నప్పుడల్లా విభాగాల వారిగా పర్యవేక్షించాల్సింది పోయి, ఆ ఫైల్స్ కంప్లీట్ చేసే పనిలో పడుతున్నారట. కౌన్సిల్ సమావేశం మూడు రోజుల ముందు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో సైతం కమిషనర్ కొంతసేపుండిపోయారు. కలెక్టరేట్ నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌లో ఆయన కూడా విసిగిపోయినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో బదిలీ కోసం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.


అనుమతి లేకుండా తవ్విన కాలువ

పాత వాటిపైనే సభ్యుల ధ్వజం

నగరపాలికలో పాలకవర్గం పేపర్లో పులుల్లా అయింది పరిస్థితి. నగరంలో అవినీతి జరిగిందని కౌన్సిల్ సమావేశాల్లో రెచ్చిపోతుంటారు. కానీ బయటకొస్తే ఆ విషయమే తమకు తెలియనట్లు వ్యవహరిస్తుంటారు. డంపింగ్ యార్డ్‌లో అవినీతి, పనిముట్లలో రూ.1.60 కోట్లు, కుక్కల వ్యవహారం, చెట్లు, ప్లాస్టిక్, స్త్రీల బాత్రూంలు, కాలువల మీద కట్టడాలు ఇలాంటివే తరచూ ప్రస్తావిస్తుంటారు. డంపింగ్‌యార్డ్‌లో అవినీతి జరిగిన సమయంలో పాలకవర్గంలో కీలకమైనవారు, కార్పొరేటర్లు ఏం చేస్తున్నారనే ప్రశ్నకు సమాధానం లేదు. రూ.1.60కోట్ల అవినీతిలో ఎంత జరిగిందో ఓ నేత చెప్పలేరు... కానీ ఆ అంశం తరచూ ప్రస్తావిస్తుంటారు. మిగిలిన సమస్యలన్నీ కార్పొరేటర్ స్థాయిలో పరిష్కారమయ్యేవి. టీడీపీ ఎమ్మెల్యే సైతం ఇక్కడ కూర్చోవాలంటే సిగ్గుగా ఉందన్నారంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. తాజా కౌన్సిల్ సమావేశంలో ఉత్తుత్తి ఆమోదంతో తీర్మానాలు చేశారనే విమర్శలున్నాయి.

అంతా ఇష్టారాజ్యం

నగరంలో ఆక్రమణలు వైసీపీ హయాంలో అధికమయ్యాయి. మాజీ ఎమ్మెల్యే శ్రీనగర్ కాలనీలో ఆక్రమించిన స్థలం ఇంకా అలానే ఉంది. ఇక అక్రమ కట్టడాల గురించే లెక్కే లేదు. ఏసీపీ ఉన్నాడన్న మాటే కానీ చర్యలు శూన్యం. తాజాగా సవేరా ఆసుపత్రి నుంచి అక్రమంగా కాలువ నిర్మాణం చేశారు. నగరంలో 150 మీటర్ల వరకు కాలువ తవ్వారు. ఈ విషయం నగరంలో అధికార, అనధికార వర్గాలకు అందరికీ తెలుసట. ఇంజనీరింగ్ విభాగం మొత్తానికి తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరించారని సమాచారం. ఆ నెపం టౌన్‌ప్లానింగ్‌పై మోపారని ఆ విభాగం అధికారులు వాపోతున్నారు. పారిశుధ్యంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ల నియామకం వ్యవహారంలో అవినీతి జరిగిందని కార్పొరేషన్ అంతా కోడైకూస్తోంది. కానీ ఎవరూ చర్యలు తీసుకోరు. కౌన్సిల్ మీటింగ్‌లో ఒక్క కార్పొరేటర్ కూడా ఆ అవినీతిపై ప్రశ్నించలేదు. అరిగిపోయిన రికార్డుల్లా పాతవాటిపైనే మాట్లాడతారు. ఎంహెచ్‌ఓ ఓ ప్రైవేట్ వ్యక్తి వెంట లేనిదే ప్లాస్టిక్ రైడ్‌లకు వెళ్లడని సమాచారం. ఇప్పుడు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల(ఆర్ఐ) పోస్టుల కోసం పైరవీలు ఆరంభమైనట్లు సమాచారం. ఇవన్నీ ఆపాలంటే కమిషనర్ సీట్లో కూర్చోవాల్సిందేనంటున్నారు.

దైవారాధనే మోక్షానికి మార్గం

● ఇస్కాన్ జీబీసీ చైర్మన్ రేవతి రమణ ప్రభు


స్వామివారికి దశహారతులు పడుతున్న చైర్మన్ రేవతి రమణ ప్రభు

అనంతపురం కల్చరల్, జూలై 14: దైవాన్ని ఆరాధించడం ద్వారానే మోక్షానికి మార్గం లభిస్తుందని ఇస్కాన్ జీబీసీ ఛైర్మన్ రేవతి రమణ ప్రభు పేర్కొన్నారు. జగన్నాథ రథోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం జిల్లాకేంద్రంలోని లలితకళా పరిషత్‌లో బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 జంటలచే సామూహికంగా కలశ పూజలు నిర్వహించి, స్వామివార్లకు భక్తుల చేతులమీదుగా కలశాభిషేకం చేయించారు. అనంతరం నిర్వహించిన స్వామివారి దర్బార్‌లో రేవతి రమణ ప్రభు చేతులమీదుగా స్వామివార్లకు దశహారతులు సమర్పించారు. భక్తులనుద్దేశించి రేవతి రమణ ప్రభు ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. జగన్నాథుడి దర్శనం జన్మజన్మల పుణ్యఫలమని పేర్కొన్నారు. నేటి బిజీ ప్రపంచంలో మనం ఎంత బిజీగా ఉన్నా దైవారాధనకు ఎంతో కొంత సమయం ఖచ్చితంగా వెచ్చించాలని, అపుడే మన జీవితానికి సార్థకత ఉంటుందన్నారు. మహామంగళహారతి నివేదనానంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఇస్కాన్ మందిర చైర్మన్ దామోదర్ గౌరంగదాస్, రాధా మనోహర్‌దాస్, శ్రీపాద వేణు, ఎల్‌కేపీ ప్రధాన కార్యదర్శి పద్మజ, వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.


స్వామివార్లకు భక్తుల చేతులమీదుగా కలశాభిషేకం


పూజల్లో పాల్గొన్న భక్తులు

కనులపండువగా గంగమ్మ జాతర

అనంతపురం కల్చరల్, జూలై 14: ఆదర్శనగర్‌లోని గంగమ్మ దేవాలయం వద్ద జిల్లా బెస్త సేవాసంఘం ఆధ్వర్యంలో ఆదివారం గంగమ్మ జాతరను కనులపండువగా నిర్వహించారు. మహిళలు బోనాలు ఎత్తుకుని ఉరుముల వాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. గంగమ్మకు సుగంధ ద్రవ్యాలతో అభిషేకించి, చందనం, సింధూరం, పట్టువస్త్రాలు, వేపమండలు, వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి, విశేష పూజలు చేశారు. మహామంగళహారతి నివేదనానంతరం భక్తులకు తీర్థప్రసాద, అన్నదాన వినియోగం చేశారు. కార్యక్రమంలో బెస్త సంఘం అధ్యక్షుడు రామకృష్ణ, కార్యదర్శి చెరకు శ్రీనివాసులు, వెంకటరమణయ్య, లక్ష్మీనారాయణ, పామిడి శీను, ప్రసాద్, భాస్కర్ పాల్గొన్నారు.


అలంకరణలో అమ్మవారు


బోనాలు మోస్తున్న చిన్నారులు


బోనాలతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

ఎంఈఓల సంఘం రాష్ట్ర సలహాదారుగా రామచంద్ర



అనంతపురం సెంట్రల్, జూలై 14: మండల విద్యాధికారుల(ఎంఈఓ) సంఘం రాష్ట్ర ముఖ్య సలహాదారుడిగా ఆర్‌ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రామచంద్ర నియమితులయ్యారు. శనివారం విజయవాడలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఏకగ్రీవంగా తనను ఎన్నుకున్నట్లు ఆదివారం రామచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. రిజర్వేషన్ ఉద్యోగుల సమస్యలపై గత ప్రభుత్వంలో ఉద్యమాలు నిర్వహించి ఫలితాలు సాధించామన్నారు. అదేవిధంగా ఉద్యోగుల అపరిష్కృత సమస్యలపై ఇటీవల మంత్రి నారా లోకేశ్‌ను కలిసి విన్నవించడంతో సానుకూలంగా స్పందించారన్నారు. ఆర్‌ఈఎఫ్, ఎంఈఓల సంఘం సమన్వయంగా పని చేస్తూ ఉద్యోగుల సంక్షేమానికి కృషిచేస్తానని ఆయన పేర్కొన్నారు

ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడి

గార్లదిన్నె, జూలై 14: మండల కేంద్రంలోని రైల్వే గేట్ వద్ద ఆదివారం ఆర్టీసీ డ్రైవర్‌పై ఆటో డ్రైవర్ దాడి చేశాడు. పోలీసులు తెలిపిన మేరకు శింగనమల మండలం నాగులగుడ్డం తండాకు చెందిన వరదరాజుల నాయక్ అనే ఆటో డ్రైవర్ స్థానిక ఇందిరమ్మ కాలనీ నుంచి గార్లదిన్నెలోకి వస్తున్నాడు. రైల్వే గేటు వేయడంతో ఆటో గేటు ముందు నిలిపాడు. పెనకచెర్ల డ్యాం నుంచి అనంతపురం వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు రైల్వే గేటు వద్ద ఆటో ముందు నిలిపాడు. దీంతో నా ఆటోనే ఓవర్‌టేక్ చేసి ఆటో ముందు నిలుపుతావా అంటు ఆటో డ్రైవర్ ఆర్టీసీ బస్సు అద్దం పగలకొట్టి డ్రైవర్ మహబూబ్ బాషాపై దాడి చేశాడు. గాయపడిన ఆర్టీసీ డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

మీటర్ రీడర్ల సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం విద్య, జూలై 14: జిల్లాలో ఉన్న విద్యుత్ మీటర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, అధ్యక్షుడు రాజేష్ గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఐ ఆఫీస్‌లో ఏపీ విద్యుత్ మీటర్ రీడర్ల యూనియన్ జిల్లా జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు వస్తున్న తరుణంలో మీటర్ రీడర్లు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఈ క్రమంలో రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను చూపాలని యాజమాన్యాన్ని, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో కాంట్రాక్టర్లు మీటర్ రీడర్లకు ఇస్తున్న రెమ్యూనరేషన్ ఒప్పందంలో ఉన్నదానికి, చేతికి ఇస్తున్నదానికి పొంతన లేదన్నారు. ఈపీఎఫ్, ఈఎస్ఐ కూడా జమ చేయడం లేదనిన్నారు. ఈ అన్యాయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వారికి న్యాయం చేయకుంటే ఏఐటీయూసీ తరఫున పెద్దఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కొత్త కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా రాజారెడ్డి, సలహాదారుడిగా రాజేష్‌గౌడ్, అధ్యక్షులుగా సుబ్రహ్మణ్యం, ప్రధానకార్యదర్శి రా ము, కోశాధికారిగా దస్తగిరి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా షేక్ షావ్వాజ్, జా యింట్ సెక్రెటరీగా సలీంను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కోశాధికారి రమేష్‌బాబు, ఏపీఎస్పీడీసీఎల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజారెడ్డి

కుళ్లాయిస్వామిని దర్శించుకున్న ఎంఎస్ రాజు


కుళ్లాయిస్వామిని దర్శించుకుంటున్న ఎంఎస్ రాజు

నార్పల, జూలై 14: గూగూడు కుళ్లాయిస్వామిని, ఆంజనేయస్వామి వార్లను మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు కుటుంబ సమేతంగా దర్శించుకున్నాడు. టీడీపీ జిల్లా నాయకుడు ఆలం వెంకటనరసానాయుడు, బీజేపీ రాష్ట్ర నాయకుడు మారుతి స్వామిని దర్శించుకున్నారు.

విలేకరిపై దాడికి యత్నం: ఆలయం ముందు భక్తాదుల పట్ల దురుసుగా అసభ్య పదజాలంతో ప్రవర్తిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఫోటోలు తీస్తుండగా ఓ పత్రికా విలేకరి సెల్‌ఫోన్ లాక్కొని దాడికి యత్నించారు. అలాంటి ఆకతాయలను గుడి ముందర ఎందుకు పెట్టారని వారిపై చర్యలు తీసుకోవాలని నార్పల పోలీస్ స్టేషన్‌లో విలేకరి ఫిర్యాదు చేశాడు.

వర్షాలు కురవాలని కరువులమ్మ తరలింపు


కరువులమ్మను తరలిస్తున్న శివపురం గ్రామస్థులు

శింగనమల జూలై 14: పంటల సాగుకు అదునుదాటుతున్నా వర్షాలు రాకపోవడంతో శివపురం గ్రామానికి చెందిన రైతులు, గ్రామస్థులు గ్రామ శివారులో వేసిన కరువులమ్మను పొలిమేరను దాటించారు. ఆదివారం గ్రామస్థులు, రైతులు శివపురం పొలిమేరలో నాలుగు రోజుల క్రితం కరువులమ్మ పాత వస్తువులను వేశారు. కరువులమ్మ ఉంటే గ్రామానికి వర్షాలు రావని మరో పొలిమేరకు వాటిని తరలించారు.

చంద్రబాబును కలిసిన డేగల కృష్ణమూర్తి


చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డేగల కృష్ణమూర్తి

శింగనమల జూలై 14: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును పంచాయతీ రాజ్ చాంబర్ కార్యనిర్వాహక కార్యదర్శి డేగలకృష్ణమూర్తి కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం మంగళగిరిలో చంద్రబాబును కలసి పంచాయతీ నిధులు రూ.250 కోట్లు ఇవ్వడం హర్షణీయం, ఆర్థిక మంత్రి పయ్యావులకేశవ్, మంత్రి నారా లోకేశ్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, అధ్యక్షుడు పల్లా శ్రీనివాసులు, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి కృతజ్ఞతలు తెలిపారు.

జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ర్యాలీ

యాడికి, జూలై14: మం డలకేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటుచేయాలని కోరుతూ ఆల్‌ఇండి యా స్టూడెంట్స్ బ్లాక్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడంతో నిరుపేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారన్నారు. ఉన్నత విద్యకు నోచుకోలేక ఎంతోమంది పేద విద్యార్థులు దినసరి కూలీలుగా మారుతున్నారన్నారు. యాడికిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుచేస్తామని వైసీపీ ప్రభుత్వ ప్రజాప్రతినిధులు బూటకపు హామిలతో కాలయాపన చేశారని వాపోయారు. కూటమి ప్రభుత్వమైనా కళాశాలను ఏర్పాటుచేయాలని వారు కోరారు. ర్యాలీలో నాయకులు బుల్లెట్ శేఖర్, మహమ్మద్‌రఫీ, తరుణ్, బలరాం, ఉదయ్, మహి తదితరులు పాల్గొన్నారు.

వాసవీ మాతకు ప్రత్యేక పూజలు

బెళుగుప్ప, జూలై 14 : మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీమాతకు ఆదివారం స్థానిక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు ఘనంగా జరిగాయి. ఆషాఢమాసం సందర్భంగా అమ్మవారిని శాఖాంబరిగా అలంకరించి పూజలు చేశారు. మహిళా భక్తులు లలితపారాయణం చేశారు. తీర్థ ప్రసాదాల వినియోగంతో పూజలు ముగిసినట్లు ఆలయ అర్చకులు నందకుమార్ స్వామి తెలిపారు.

మెగా కంటి వైద్యశిబిరం

రాయదుర్గంరూరల్: పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో ఆదివారం ఛేంజ్ ఫర్ సొసైటీ టీం వారు నంద్యాలకు చెందిన శాంతిరామ్ కంటి వైద్యశాల సహకారంతో, దాత పశుపతినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సేవాదృక్పథాన్ని అలవరచుకోవాలన్నారు. మనం చేసే సేవలు సమాజానికి ఉపయోగపడే విధంగా ఉండాలన్నారు. అనంతరం వైద్యులు శిబిరానికి వచ్చిన దాదాపు 300 మందికి కంటి పరీక్షలు చేసి 72 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. వారిని నంద్యాల కంటి ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మంజునాథగౌడ్, పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, చేంజ్ ఫర్ సొసైటీ టీం తదితరులు పాల్గొన్నారు.

బీజేపీపై విమర్శలు తగవు

గుంతకల్లుటౌన్,జూలై14: ఆర్‌ఎస్‌ఎస్‌ను, బీజేపీని విమర్శించే అర్హత పీసీసీ మాజీ అధ్యక్షుడు శైలజానాథ్‌కు లేదని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొలిమి రామాంజనేయులు పేర్కొన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శైలజానాథ్ ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీని విమర్శించే ముందు కాంగ్రెస్ దేశానికి, ఏపీకి ఏం చేసిందో తెలపాలన్నారు. ప్రధాని మోదీ పాలన చూసి ఓర్వలేకనే కాంగ్రెస్ నాయకులు నోటికి వచ్చినట్లుగా మాట్లాడుతున్నారు. దేశ అభివృద్ధి ప్రధాని మోదీతోనే సాధ్యమన్నారు. సమావేశంలో నాయకులు పీ హరిహరనాథ్, కొలిమి శేఖన్న, వడ్డేరమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు నగదు బహుమతులు

ఉరవకొండ,జూలై14: ఇటీవల విడుదలైన టెన్త్, ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చూసిన దేవాంగ కులస్థుల విద్యార్థులకు పట్టణంలోని దేవాంగ కల్యాణమండపంలో ఆదివారం నగదు బహుమతులు అందజేశారు. స్థానిక దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రతిభ చూసిన పది మంది విద్యార్థులను సన్మానించారు. అనంతరం నగదు బహుమతులను అందజేశారు. దేవాంగ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు సీ.మహేష్, సభ్యులు చంద్రమౌళి, విశ్వనాథ్, బొజ్జన్న, ముక్కరబాలచంద్ర, సూర్యనారాయణ, రామాంజనేయులు పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం

గుత్తి,జూలై14: పట్టణం నుంచి ఊటకల్లు గ్రామానికి మద్యంను అక్రమంగా తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి 14మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. మండలంలోని ఊటకల్లు గ్రామానికి గురున్నాథ్ రెడ్డి మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తుండగా సమాచారం వచ్చిందని, దీంతో వెంటనే వెళ్లి పట్టణంలోని గాంధీ సర్కిల్ వద్ద పట్టుకుని అరెస్టు చేశామని, అతడి వద్ద నుంచి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని పోలీసులు చెప్పారు.

పీర్లకు వెండి ఆభరణాల సమర్పణ

రాయదుర్గంరూరల్, జూలై 14: మండలంలోని ఆర్‌బీ వంక గ్రామానికి చెందిన శ్రీధరశెట్టి, నాగవేణి దంపతులు ఆవులదట్ల గ్రామంలో గల పీర్లకు వెండి ఆభరణాలు సమర్పించారు. సుమారు 1200 గ్రాముల వెండితో పలు ఆభరణాలు చేయించారు. మొహర్రం వేడుకల సందర్భంగా ఆదివారం వాటిని గ్రామపెద్దలకు అందజేశారు.

ఎస్‌కే ఆంజనేయులుకు ఘన నివాళి

కుందుర్పి, జూలై 14 : ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేసిన ఎస్‌కే ఆంజనేయులు మూడో వర్ధంతిని మండలకేంద్రంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. అనంతరం సమాజ క్రాంతి ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు లెనిన్ బాబు మాట్లాడుతూ.. ఎస్‌కే ఆంజనేయులు కమ్యూనిస్టు నాయకుడిగా, కుందుర్పి గ్రామ సర్పంచ్‌గా 50 ఏళ్లకు పైబడి ప్రజా సమస్యల పరిష్కారం కోసం అలుపెరగని పోరాటం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు , విద్యార్థులు పాల్గొన్నారు.

వాసవీ మాతకు ప్రత్యేక పూజలు


శాకంబరి అలంకరణలో వాసవీమాత

బెళుగుప్ప, జూలై 14 : మండల కేంద్రంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవీమాతకు ఆదివారం స్థానిక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు ఘనంగా జరిగాయి. ఆషాడమాసం సందర్భంగా అమ్మవారిని శాఖాంబరిగా అలంకరించి పూజలు చేశారు. మహిళా భక్తులు లలితపారాయణం చేశారు. తీర్థ ప్రసాదాల వినియోగంతో పూజలు ముగిసినట్లు ఆలయఅర్చకులు నంద కుమార్ స్వామి తెలిపారు.

ఉద్యోగులకు వేధింపులు ఉండవ్

● ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం, జూలై 14: కూటమి ప్రభుత్వంలో ఉద్యోగులకు వేధింపులు ఉండవని, వారి గౌరవ మర్యాదలకూ భంగం కలగకుండా చూస్తామని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలోని కురిహినశెట్టి కల్యాణ మండపంలో ఆదివారం ఎమ్మెల్యేకు ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మికుల ఆధ్వర్యంలో సన్మానసభ జరిగింది. కార్యక్రమానికి జేఏసీ కన్వీనర్ కెంచె లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. తొలుత ఎమ్మెల్యేను శాలువా కప్పి, పూలమాలలు వేసి, ముంజేతికంకణధారణ చేసి ఘనంగా సత్కరించారు. తర్వాత ఉద్యోగుల సమస్యలపై వినతిపత్రాన్ని సమర్పించారు. వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్యోగుల పట్ల స్నేహభావంతో మెలుగుతూ రాయదుర్గం నియోజకవర్గ అభివృద్ధి కోసం ముందుకెళ్తామన్నారు. ముఖ్యంగా భైరవానితిప్ప ప్రాజెక్టుకు కృష్ణాజలాలు అందించడానికి, లక్ష ఎకరాలకు సాగునీరివ్వడానికి కంకణబద్ధుడై ఉన్నానన్నారు. ఉద్యోగులను అణచివేసే ధోరణి కూటమి ప్రభుత్వంలో ఉండదన్నారు. ఉద్యోగులతో స్నేహంగా ఉండి అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం, ఉపాధ్యాయుల సంఘం నాయకులు రామాంజనేయులు, పరమేశ్వరప్ప, వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సన్మానించిన వైద్యసిబ్బంది

బొమ్మనహాళ్: ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులును బొమ్మనహాళ్‌కు చెందిన వైద్యసిబ్బంది సన్మానించారు. వారు రాయదుర్గం పట్టణంలో ఎమ్మెల్యేను కలిసి శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. హెల్త్ అసిస్టెంట్లు జైనబీ, గోవర్ధన్, వెంకటరమణ, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలి

కణేకల్లు: చిక్కణ్ణేశ్వర వడియార్ చెరువు అవుట్‌ఫాల్ రెగ్యులేటర్ వద్ద కల్వర్టు మరమ్మతు పనులు గత రెండు రోజులుగా జరుగుతున్నాయి. వీటిని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని సూచించారు. చిక్కణ్ణేశ్వర వడియార్ చెరువు వద్ద షట్టర్లు ఉన్న ప్రాంతంలో కల్వర్టు కూలడంతో దిగువ వైపునకు నీటి ప్రవాహానికి ఆటంకం కలిగే అవకాశం ఉందన్నారు. మరో 15 రోజుల్లో నీటి విడుదలయ్యే అవకాశం ఉందని, కనుక కల్వర్టు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. అనంతరం ఆయన మండలంలోని హనుమాపురం గ్రామంలో లాలూస్వామి పీర్లను దర్శించుకుని చక్కెర చదివింపులు చేయించారు. అగ్నిగుండం చుట్టూ ప్రదక్షిణ చేసి మొక్కుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జయరాంచౌదరి, ఎంపీటీసీ నరేంద్ర, టీడీపీ నాయకులు లాలెప్ప, ఆనంద్‌రాజ్, బీటీ రమేష్, చంద్రశేఖర్‌గుప్తా, అనిల్, చాంద్‌బాషా, కురుబ నాగరాజు, ఫకృద్దీన్, మాబుసాబ్, తూర్పు రఘునాథ్, ఎస్‌కే మల్లికార్జున, వేలూరు మరియప్ప, లాలెప్ప, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చిన్నసరిగెత్తు


తాడిపత్రిలోని గాంధీకట్ట వద్ద కొలువుదీరిన పీర్లు


బెళుగుప్పలో ..

తాడిపత్రి, జూలై14: మొహర్రం వేడుకల్లో భాగంగా పట్టణంలో ఆదివారం చిన్నసరిగెత్తును ఘనంగా జరిగింది. ముఖ్యంగా గాంధీకట్ట సమీపంలోని పీర్ల మఖానం వద్దకు భక్తులు అధిక సంఖ్యలో తరలివెళ్లి పీర్లస్వాములకు చక్కెర చదివింపులు చేయించి ప్రార్థనలు చేశారు. అగ్నిగుండం చుట్టూ ప్రదక్షిణలు చేశారు.

యల్లనూరు: మండలంలో చిన్నసరిగెత్తును ఘనంగా నిర్వహించారు. ముజావర్లు పీర్లచావిడిలో ఏర్పాటు చేసిన పీర్లకు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. మండలకేంద్రంలోని అచ్చుగట్ల వీధికి చెందిన పీర్లను ఆనవాయితీ ప్రకారం పెద్దమల్లేపల్లి గ్రామానికి తీసుకెళ్లి ఊరేగింపు చేశారు. అనంతరం గ్రామంలోకి తీసుకొచ్చి ఊరేగించారు.

కొలువుదీరిన పీర్లు

పుట్లూరు: మండలవ్యాప్తంగా పలు గ్రామాల్లో మొహర్రం వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పీర్ల మఖానాల వద్ద అగ్నిగుండం వెలిగించారు. ఈ సందర్భంగా భక్తులు పీర్లస్వాములకు చక్కెర చదివింపులు చేయించి ప్రార్థలు జరిపారు. ఎల్లుట్ల గ్రామంలో చిన్నసరిగెత్తు నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి పానకాలు తీసుకెళ్లి పీర్ల మఖానంలో సమర్పించారు. గ్రామస్థులు పానకాలతో అగ్నిగుండం చుట్టూ ప్రదక్షిణ చేశారు.

బెళుగుప్ప: మొహర్రం వేడుకల సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో పీర్లు కొలువుదీరాయి. బెళుగుప్పలో సోమవారం ప్రతిఇంటి నుంచి పానకాలను తీసుకెళ్లి పీర్లమఖానంలో సమర్పించారు. అలాగే చక్కెర చదివింపులు చేయించారు.

రాయదుర్గంరూరల్: మండలంలోని పలు గ్రామాల్లో మొహర్రం వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆర్‌బీ వంక, జుంజురంపల్లి, ఆవులదట్ల, కొంతానపల్లి, మల్లాపురం, కొండాపురం, టీ వీరాపురం, వేపరాల, వడ్రవన్నూరు తదితర గ్రామాలలో పీర్లను అలంకరించి కొలువుదీర్చారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని చక్కెర చదివింపులు చేయించి ప్రార్థనలు చేపట్టారు.

నిర్మించారు.. వదిలేశారు

● నిర్మాణం పూర్తయి ఏళ్లు గడుస్తున్నా..

ప్రారంభానికి నోచుకోని ప్రభుత్వ భవనాలు



రాకెట్లలో ప్రారంభానికి నోచుకోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం



ఉరవకొండలో యోగా హాల్, క్యాంటీన్

ఉరవకొండ,జూలై14: మండలంలోని పలు గ్రామాల్లో ఆర్బీకే భవనాలు, ప్రాథమిక ఆరోగ్యకేంద్ర భవనాలను నిర్మించి ఏళ్లు గడుస్తున్నా.. ఇంతవరకు వాటిని ప్రారంభించలేదు. దీంతో ఆ భవనాలు నిరుపయోగంగా ఉండి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. రాకెట్ల గ్రామంలో రూ.1.57కోట్ల వ్యయంతో ప్రాథమిక ఆరోగ్యకేంద్ర భవనాన్ని నిర్మించారు. నిర్మాణం పూర్తయి ఏడాది కావస్తున్నా.. ఇప్పటి వరకు ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో పాత భవనంలోనే ఆస్పత్రిని నిర్వహిస్తున్నారు. అలాగే చిన్నముష్టూరు, మోపడి గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల భవనాలను నిర్మించినా వాటిని వినియోగంలోకి తీసుకురాలేదు. పట్టణంలోని క్యాంటీన్, యోగా హాల్‌లు కూడా నిర్మించి వదిలేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ఫొటో తొలగించారు.. పేరు మార్చలేదు..



చెర్లోపల్లి రైతుభరోసా కేంద్రం

పుట్లూరు, జూలై14: మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో రైతుభరోసా కేంద్రానికి పేరు, మాజీ సీఎం జగన్ ఫొటోలు మార్చకపోవడంతో రెండురోజుల క్రితం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైన విషయం విదితమే. వీటికి స్పందించిన అధికారులు ఆదివారం మాజీ సీఎం జగన్ ఫొటో తీసివేయడంతో పాటు వైఎస్‌ఆర్ అనే అక్షరాలను తెల్లని రంగుతో కొట్టివేశారు. రైతుభరోసా కేంద్రం కాకుండా వీటిని రైతు సేవా కేంద్రంగా మార్చాల్సి ఉంది. నిధుల కొరత కారణంగా పేర్లు మార్చలేదని తెలిసింది. ఇంకా చాలా సచివాలయాలకు, రైతుభరోసా కేంద్రాలకు గత వైసీపీ ప్రభుత్వ ఫొటోలే దర్శనమిస్తున్నాయి.

కోట ముఖద్వారాన్ని పునరుద్ధరించండి

రాయదుర్గంరూరల్, జూలై 14: పట్టణంలోని కోట ముఖద్వారానికి కేంద్ర పురావస్తుశాఖ ఆధ్వర్యంలో పునరుద్ధరించాలని హెరిటేజ్ అసోసియేషన్ నాయకులు హలికుంటి మూర్తి, గుడేకోట శివకుమార్ కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులును ఆదివారం కలిసి వినతిపత్రం అందించారు. ఎంతో చరిత్ర కలిగిన కోట ముఖద్వారం శిథిలావస్థకు చేరుకుందని, పునరుద్ధరణ పనులను చేపట్టాలని కోరారు. అలాగే పట్టణంలోని రైల్వేస్టేషన్ కొత్తభవనాన్ని ప్రారంభించాలన్నారు. ఇక్కడ ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలిపే విధంగా చూడాలన్నారు. పట్టణ పరిసరాలలో చెరువులు, కుంటల జీర్ణోద్ధారణ పనులను చేపట్టాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.

ట్రాన్స్‌ఫార్మర్లే.. టార్గెట్

● పొలాల్లో ఉన్న వాటిని ధ్వంసం చేసి కాపర్‌ను అపహరిస్తున్న దొంగలు

● కళ్యాణదుర్గం నియోజకవర్గంలో అధికమైన చోరీలు

● బెంబేలెత్తుతున్న రైతులు


భట్టువానిపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసిన దృశ్యం (ఫైల్)

కళ్యాణదుర్గం, జూలై 14: గతంలో దొంగలు తాళాలు వేసిన ఇళ్లను, లేదా పొలాల్లో డ్రిప్పులు, స్ప్రింక్లర్లను మాత్రమే టార్గెట్ చేసుకుని చోరీలకు పాల్పడేవారు. కాగా ఈ సారి కొత్త పంథాను ఎంచుకున్నారు. వ్యవసాయ పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లపై గురి పెట్టారు. కొద్ది కాలంగా కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో గల వ్యవసాయ పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి రాగి వైర్లను అపహరిస్తున్నారు. దీంతో ప్రజలు, రైతులు భయాందోళనకు గురవుతున్నారు. అన్నదాతలకు కంటి మీద కునుకు లేకుండా పోతోంది. చివరికి వారికి ట్రాన్స్‌ఫార్మర్లకు కూడా కాపలా కాసే పరిస్థితి నెలకొంది.

ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం.. రాగి వైరు చోరీ

కళ్యాణదుర్గం మండలం కామక్కపల్లి ప్రాథమిక పాఠశాలలో గత ఏప్రిల్ 30వ తేదీన సబ్ మెర్సిబుల్ మోటార్‌ను దుండగులు ఎత్తుకెళ్లారు. ఇదే నెలలో బోరంపల్లి సమీపంలోని ఓ వ్యవసాయ తోటలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి రాగి వైరును అపహరించారు. అలాగే యర్రంపల్లి, దురదకుంట, భట్టువానిపల్లి గ్రామాల్లో కూడా దుండగులు అదే పనే చేశారు. కంబదూరు మండలం కుర్లపల్లిలో 24 గంటలు విద్యుత్‌ను సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి రాగి వైరును ఎత్తుకెళ్లారు. ఇదే మండలంలోని ఓబయ్యతోట సమీపంలో కూడా అలానే చేశారు. ఇక గ్రామ పరిసర ప్రాంతాల్లో, బహిరంగ ప్రదేశాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను కూడా వారు వదలడం లేదు.

మార్కెట్‌లో రాగి వైరుకు మంచి డిమాండ్

రైతులు వేలాది రూపాయలు ఖర్చుచేసి పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకుంటే, దొంగలు వాటినే టార్గెట్ చేస్తున్నారు. ప్రస్తుతం రాగి వైరుకు మార్కెట్‌లో డిమాండ్ ఉంది. కిలో రాగి వైరు ధర రూ.900 నుంచి రూ.1000 వరకు పలుకుతోంది. ఒక ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి వైర్‌ను అమ్మితే రూ.12వేలు నుంచి రూ.15 వేలు వరకు వస్తాయి. దీంతో దొంగల కన్ను వాటిపై పడింది. పోలీసులు చర్యలు చేపట్టి వీటిని అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

తోటల్లోకి కాపలాగా వెళ్తున్నాం



ఇటీవల పొలాల్లో దొంగల బెడద అధికమైంది. దీంతో రాత్రి పూట ట్రాన్స్‌ఫార్మర్లకు తోటల్లోకి కాపలాగా వెళ్తున్నాం. ట్రాన్స్‌ఫార్మర్ ఉంటేనే కదా, మోటార్లు పని చేసి, తోటకు నీరు సరఫరా అయ్యేది. అదే ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేస్తే, మరలా కొత్తది తెచ్చి పెట్టుకోవాలంటే గగనమవుతోంది. అందుకనే ముందుగానే జాగ్రత్తగా కాపలాగా వెళ్తున్నాం. పోలీసులు ఈ చోరీలకు అడ్డువేయాలి.

-జీ. రామాంజి, రైతు, మేళ్లకుంట

పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టాలి



వేలాది రూపాయలు ఖర్చు చేసి పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకుంటే, వాటిని దొంగలు ధ్వంసం చేస్తున్నారు. దీంతో ఆర్థికంగా చాలా నష్టపోతున్నాం. దొంగల బెడద ఎక్కువడంతో ప్రతిరోజు రాత్రి పూట తోటల్లోకి కాపలాగా వెళ్తున్నాం. ఈ దొంగతనాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టాలి.

- రవి, రైతు, ఒంటారెడ్డిపల్లి

మొహర్రం ప్రశాంతంగా చేసుకోవాలి: డీఎస్పీ


పెద్దపప్పూరులో మాట్లాడుతున్న డీఎస్పీ

యాడికి/పెద్దపప్పూరు/పెద్దవడుగూరు, జూలై14: మొహర్రం వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని తాడిపత్రి డీఎస్పీ జనార్దన్‌నాయుడు సూచించారు. యాడికి మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆదివారం ఆయన మొహర్రం వేడుకల నిర్వాహకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మొహర్రంను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలన్నారు. రాజకీయ కక్షలను దృష్టిలో ఉంచుకొని గొడవలకు దిగడం వంటివి జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో సీఐ నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే పెద్దపప్పూరు పోలీస్‌స్టేషన్‌లోనూ ఆయన మొహర్రం వేడుకల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చూసుకోవాల్సిన బాధ్యత నిర్వాహకులదేనని తెలిపారు. పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. ఎస్‌ఐ మహమ్మద్‌గౌస్, సిబ్బంది పాల్గొన్నారు. పెద్దవడుగూరు పోలీస్‌స్టేషన్‌లో కూడా డీఎస్పీ పీర్ల పండుగ నిర్వాహకులతో సమావేశం నిర్వహించి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. సమావేశంలో సీఐ రోషన్, ఎస్‌ఐ రెడ్డప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

రేబీస్ నివారణకు కృషి చేయాలి


పెంపుడు కుక్కకు టీకా వేస్తున్న పశువైద్యుడు

రాయదుర్గం రూరల్, జూలై 14: రేబీస్‌వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పశువైద్యాధికారి సూర్యనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని పశువైద్యశాలలో ఆదివారం మున్సిపల్ అధికారులు, పశువైద్యాధికారి రేబిస్ వ్యాక్సినేషన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి సుమారు 48 కుక్కలకు, ఎనిమిది పిల్లులకు టీకాలు వేశారు. తర్వాత మాట్లాడుతూ రేబిక్ వ్యాక్సిన్ ప్రాముఖ్యతను పెంపుడు జంతువుల యజమానులకు వివరించారు. రేబిస్‌కి ఎలాంటి చికిత్స లేదని, నివారణే మార్గమని తెలిపారు. కుక్కలు, పిల్లులను పెంచుకుంటున్న యజమానులు వాటికి రేబిస్ టీకాలు వేయించాలని సూచించారు.

లయన్స్‌క్లబ్ కమిటీల ఏర్పాటు

గుత్తి/ఉరవకొండ, జూలై14: గుత్తి పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్లో ఆదివారం లయన్స్ క్లబ్ నూతన కమిటీల ఎన్నిక జరిగింది. గుత్తి పట్టణ అధ్యక్షుడిగా శ్రీనివాసులు, కార్యదర్శిగా రాఘవేంద్రస్వామి, కోశాధికారిగా శివశంకర్‌ను ఎన్నుకున్నారు. అలాగే ఉరవకొండ పట్టణ అధ్యక్షుడిగా జయకృష్ణ, ఉపాధ్యక్షులుగా చందాకేశన్న, విశ్వనాథ్, ప్రధాన కార్యదర్శిగా నగేష్ బాబు, సహాయకార్యదర్శిగా లక్ష్మీనారాయణ, కోశాధికారిగా జాబీర్, సహాయ కోశాధికారిగా నజీర్‌సాహెబ్ ను ఎన్నుకున్నారు. అనంతరం లయన్స్ క్లబ్ అడిషనల్ డైరెక్టర్ అనిల్‌కుమార్, ప్రొసైడింగ్ అధికారి కేజేఆర్ చైతన్య మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ సేవలను మరింత విస్తృత పరచాలని సూచించారు. కార్యక్రమంలో క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రమేష్‌నాథ్‌రెడ్డి, వైస్ గవర్నర్ విరూపాక్షరెడ్డి, జీఎంటీ చైర్మన్ హరినాథ్‌రెడ్డి, కణేకల్లు, అనంతపురం, కల్యాణదుర్గం, పామిడి, ఉరవకొండ లయన్స్ క్లబ్ సభ్యులు , మదనపల్లి సీఐ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


యాడికి, జూలై14: మండలకేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటుచేయాలని కోరుతూ ఆల్‌ఇండియా స్టూడెంట్స్ బ్లాక్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడంతో నిరుపేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారన్నారు. ఉన్నత విద్యకు నోచుకోలేక ఎంతోమంది పేద విద్యార్థులు దినసరి కూలీలుగా మారుతున్నారన్నారు. యాడికిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుచేస్తామని వైసీపీ ప్రభుత్వ ప్రజాప్రతినిధులు బూటకపు హామీలతో కాలయాపన చేశారని వాపోయారు. కూటమి ప్రభుత్వమైనా కళాశాలను ఏర్పాటుచేయాలని వారు కోరారు. ర్యాలీలో నాయకులు బుల్లెట్ శేఖర్, మహమ్మద్‌రఫీ, తరుణ్, బలరాం, ఉదయ్, మహి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి పరామర్శ


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ధర్మతేజ

కుందుర్పి, జూలై 14 : మండల కేంద్రానికి చెందిన టీడీపీ కార్యకర్త సజ్జల రాజు (35) శనివారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు అల్లుడు, టీడీపీ మండల పరిశీలకులు ధర్మతేజ ఆదివారం గ్రామానికి వచ్చి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. టీడీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయన వెంట పార్టీ కళ్యాణదుర్గం పట్టణ కన్వీనర్ రంగనాథ్, సీనియర్ నాయకులు పెద్ద నరసింహప్ప, మల్లికార్జున, తహీర్, ఓబయ్య, తదితరులు ఉన్నారు.

గుండెపోటుతో టీడీపీ మహిళా కార్యకర్త మృతి


వీఎల్ సరోజమ్మ(ఫైల్)

బొమ్మనహాళ్, జూలై 14: మండలంలోని దర్గాహోన్నూరు గ్రామానికి చెందిన టీడీపీ మహిళా కార్యకర్త వీఎల్ సరోజమ్మ(48) గుండెపోటుతో మృతి చెందారు. మాజీ సర్పంచ్ కేశప్ప, మాజీ ఎంపీటీసీ ఆనంద్ తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం మధ్యాహ్నం సరోజమ్మకు అకస్మాత్తుగా గుండెపోటు వచ్చింది. వెంటనే కుటుంబసభ్యులు బళ్లారి ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు గ్రామానికి చేరుకుని ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి భర్త రామాంజనేయులును పరామర్శించారు.

ఎంఈఓల సంఘం రాష్ట్ర సలహాదారుగా రామచంద్ర



అనంతపురం సెంట్రల్, జూలై 14: మండల విద్యాధికారుల(ఎంఈఓ) సంఘం రాష్ట్ర ముఖ్య సలహాదారుడిగా ఆర్‌ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రామచంద్ర నియమితులయ్యారు. శనివారం విజయవాడలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఏకగ్రీవంగా తనను ఎన్నుకున్నట్లు రామచంద్ర ఆదివారం ప్రకటనలో తెలిపారు. రిజర్వేషన్ ఉద్యోగుల సమస్యలపై గత ప్రభుత్వంలో ఉద్యమాలు నిర్వహించి ఫలితాలు సాధించామన్నారు. అదేవిధంగా ఉద్యోగుల అపరిష్కృత సమస్యలపై ఇటీవల మంత్రి నారా లోకేశ్‌ను కలిసి విన్నవించడంతో సానుకూలంగా స్పందించారన్నారు. ఆర్‌ఈఎఫ్, ఎంఈఓల సంఘం సమన్వయంగా పనిచేస్తూ ఉద్యోగుల సంక్షేమానికి కృషిచేస్తానని ఆయన పేర్కొన్నారు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

బెళుగుప్ప, జూలై 14 : మండలంలోని అంకంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2005-2006 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో గెట్‌టూ గెదర్ నిర్వహించారు. ఈ సందర్భం గా 19 ఏళ్ల తర్వాత అందరూ ఒక చోట కలుసుకుని నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. యోగక్షేమాలను అడిగితెలుసుకున్నారు. తర్వాత నాటి గురువులు విజయ్‌కుమార్, శ్రీనివాసులును సన్మానించారు.